ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY

నల్లగొండ

5

శుక్రవారం 5 జూలై 2024

గరిష్ఠం 34.5
కనిష్ఠం 24.4



ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	503.90 (121.5462)	నిల్	800
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	637.58 (2.69)	నిల్	నిల్
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	95.17 (0.43)	339	50

చికెన్ ధరలు | లైవ్ : రూ.136 | డ్రెస్ : రూ.200 | స్కిన్‌లెస్ : రూ.224



భూసమస్యల పరిష్కారంపై ఆశలు

- ప్రత్యేక దృష్టి సారించిన కలెక్టర్
- రెండు వారాలుగా మండల స్థాయిల్లో ఫిర్యాదుల స్వీకరణ
- డేటా కరెక్షన్ ఫిర్యాదులే అధికం

నల్లగొండ, జూలై 4 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం పూనుకున్నా, క్షేత్రస్థాయి సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా ఫిర్యాదులు వెల్లువెత్తుతూనే ఉన్నాయి. ఈ పరిస్థితిలో మార్పు తీసుకువచ్చేందుకు కలెక్టర్ సి.నారాయణరెడ్డి దృష్టిసారించారు. మండల కేంద్రాల్లో సైతం 'ప్రజావాణి' నిర్వహిస్తూ ప్రధానంగా భూ సమస్యల పరిష్కారానికి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు.

ధరణి పోర్టల్ అమలులోకి వచ్చాక భూ సంబంధిత ఫిర్యాదుల సంఖ్య పెరిగింది. ధరణిలో భూరికార్డుల నమోదు సమయంలో లోపాల కారణంగా పలు ఖాతాలు సక్రమంగా నమోదవకపోవడంతో భూయజమానులు తహసీల్దార్, కలెక్టర్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. కలెక్టర్ కార్యాలయంలో ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణికి వచ్చే ఫిర్యాదుల్లో దాదాపు సగానికి పైగా భూసమస్యలే ఉంటున్నాయి. అందులోనూ ఎక్కువ భాగం మండల స్థాయిల్లో పరిష్కరించేవే అయినా, అక్కడ ఫలితం లభించక బాధితులు కలెక్టరేట్‌కు వస్తున్నారు. భూరికార్డుల డేటా ఎంట్రీలో దొర్లిన తప్పులు, లోపాలు, అక్షర దోషాలు, పొరపాట్లు భూయజమానులకు శాపంగా మారింది. దీంతో భూసమస్యల పరిష్కారంపై కలెక్టర్ నారాయణరెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. ఇప్పటికే రెండు సోమవారాలు మండల స్థాయి ప్రజావాణి నిర్వహించి అర్జీలు తీసుకోగా, అందులోనూ భూవివాదాలకు సంబంధించినవే ఎక్కువగా ఉన్నాయి. ధరణి పోర్టల్‌పై ప్రత్యేక దృష్టి సారించి, భూసమస్యకు సంబంధించిన ప్రతీ దరఖాస్తును పరిశీలించి, పరిష్కరించాలని, పరిష్కారం కుదరకపోతే స్పష్టమైన కారణాన్ని తెలియజేసి దరఖాస్తును ఎండార్స్ చేయాలని కలెక్టర్ స్పష్టంగా ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు అటు మండలాలు, ఇటు కలెక్టర్ కార్యాలయానికి వచ్చిన దరఖాస్తులు 23,813 ఉండగా, అందులో 2,120 దరఖాస్తులే పరిష్కారమయ్యాయి. ఇంకా 21,693 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిలో పరిష్కారానికి వీలైనవాటిని పక్షం రోజుల్లోగా పరిష్కరించాలని కలెక్టర్ మార్గదర్శకాలు ఇవ్వడంతో తహసీల్దార్లు ఆదిశగా పనిచేస్తున్నారు.

డేటా కరెక్షన్ సమస్యలే అత్యధికం

జిల్లాలో వచ్చిన దరఖాస్తుల్లో అత్యధికంగా 'ధరణి' డేటా కరెక్షన్ సమస్యలే అధికంగా ఉన్నాయి. డేటా కరెక్షన్‌కు సంబంధించి మొత్తం 16,455 దరఖాస్తులు రాగా, వాటిలో ఇప్పటివరకు 1,102 పరిష్కారమయ్యాయి. ఇంకా జిల్లాలో 15,353 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ విభాగంలో అత్యధికంగా పేరు, ఇంటిపేరు, తండ్రి పేరు, సర్వే నెంబర్, బైనెంబర్ తప్పుగా నమోదవడం, కులం పేరు మారడం, విస్తీర్ణంలో హెచ్చు తగ్గులు, పట్టా భూములు వేరే రకంగా నమోదవడం, ఒకరి భూమి ఇంకొకరికి పట్టా కావడం లాంటి కేసులే అధికంగా ఉన్నాయి. ధరణిలో డేటా నమోదును పూర్తిగా ఆపరేటర్లకే వదిలేయకుండా జాగ్రత్తలు వహించి ఉంటే ఈ లోపాలు ఉండేవి కావనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

పేటలో 7,660 దరఖాస్తులు పెండింగ్

సూర్యాపేట జిల్లాలో 'ధరణి'కి సంబంధించి 9,681 దరఖాస్తులు వచ్చాయి. అందులో 1,021 దరఖాస్తులను అధికారులు తిరస్కరించగా, 7,660 వివిధ దశల్లో ఉన్నాయి. ఇవన్నీ తహసీల్దార్, ఆర్డీవో, అదనపు కలెక్టర్ వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. ఇందులో పౌతి, డాటా కరెక్షన్, పెండింగ్ మ్యుటేషన్, సెమీ అర్బన్, కోర్టు కేసులు దరఖాస్తులు ఉన్నాయి. ఈ దరఖాస్తుల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ధరణి పోర్టల్‌లో సమస్యలపై వచ్చిన దరఖాస్తులు ఇలా..

కేటగిరీ	దరఖాస్తులు	పరిష్కారమైనవి	పెండింగ్
ఎన్ఆర్ఐల పట్టా పుస్తకాలు	7	0	7
కోర్టు కేసు ఇంటిమేషన్	1,272	715	557
కోర్టు కేసుల పట్టా పుస్తకాలు	284	1	283
డేటా కరెక్షన్	16,455	1,102	15,353
జీపీఏ	10	5	5
ప్రొహిబిటెడ్ ప్రాపర్టీ	1,878	1	1,877
నాలా, ఇంటి స్థలాల పాస్‌పుస్తకాలు	6	0	6
ఖాతా మెర్జింగ్	12	2	10
ల్యాండ్ మ్యాటర్స్ (గ్రీవెన్స్)	1,600	26	1,574
నాలా డబ్ల్యూవో పట్టాపుస్తకం	140	34	106
ఆర్గనైజేషన్ పీపీబీ	2	0	2
పెండింగ్ మ్యుటేషన్	1,040	64	976
సక్సెషన్	989	170	819
అర్బన్ ల్యాండ్	118	---	118
మొత్తం	23,813	2,120	21,693

వనమహోత్సవానికి వడివడిగా



- జిల్లాలో 66లక్షలకు పైగా మొక్కలు నాటేందుకు అధికారుల నిర్ణయం
- నాటిన ప్రతీ మొక్కను బతికించేలా ప్రణాళిక
- రహదారులకు ఇరువైపులా, ప్రభుత్వ కార్యాలయాల్లో మొక్కలు నాటనున్న అధికారులు

నల్లగొండ, జూలై 4: హరితహారం స్థానంలో ప్రభుత్వం ఈ వర్షకాలంలో 'వనమహోత్సవం' పేరుతో కార్యక్రమం చేపట్టేందుకు సన్నాహాలు చేస్తోంది. నాటిన ప్రతీ మొక్కను బతికించేలా ప్రణాళికను రూపొందించింది. జిల్లాలోని అన్ని రహదారులకు ఇరువైపులా మొక్కలు నాటడంతో పాటు ప్రభుత్వ కార్యాలయాల్లోని ఖాళీ స్థలం సైతం అధికారులు మొక్కలు నాటనున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని యంత్రాంగం చేపట్టనుంది.

మొక్కలను వృథా చేయకుండా నాటిన ప్రతీ మొక్కను రక్షించాలని అధికారులు నిర్ణయించారు. మొక్కలు నాటేందుకు సరైన స్థలాన్ని ఎంపిక చేయడంతో పాటు అన్ని ప్రభుత్వ సంస్థలు, రహదారుల వెంట మొక్కలు నాటనున్నారు. మొక్కలు నాటేందుకు గుంతల విషయంలో జాగ్రత్తలు పాటించడంతోపాటు మొక్కల ఎంపిక, భూమిని సిద్ధం చేయడం, నాటిన సమయంలో ఎరువులు వేయడం, నీటిని అందించడంతోపాటు వాటి సంరక్షణకు చర్యలు తీసుకోనున్నారు. మొక్కలు నాటేందుకు వాచర్‌ను ఏర్పాటు చేయనున్నారు. వారు మొక్కలను సంరక్షణ బాధ్యతలు తీసుకుంటారు.

66లక్షల మొక్కల లక్ష్యం

వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా జిల్లాలో ఈ ఏడాది వానాకాలంలో 66.06లక్షల మొక్కలు నాటేందుకు అధికారులు నిర్ణయించారు. మొక్కల సంరక్షణకు ఫీల్డ్ అసిస్టెంట్ మొదలు మేట్‌లకు శిక్షణ ఇవ్వనున్నారు. అందుకు డీఆర్‌డీవోకు బాధ్యతలను అప్పగించారు. రహదారులకు ఇరువైపులా స్థలం అధికంగా ఉంటే బహుళ వరుసల్లో మొక్కలు నాటనున్నారు. జిల్లా స్థాయిలో కార్యక్రమం చేపట్టడంతో పాటు నియోజకవర్గ స్థాయిలో మొక్కలను నాటేందుకు కార్యచరణ రూపొందించారు. వన మహోత్సవానికి ఆయా నియోజకవర్గాల్లో స్థానిక శాసనసభ్యులను ఆహ్వానించడంతో పాటు జిల్లా స్థాయి అధికారులకు నిర్దేశించి లక్ష్యం మేరకు మొక్కలు నాటేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. ఇప్పటికే నర్సరీల ద్వారా మొక్కలను సేకరించే పనుల్లో అధికారులు ఉన్నారు. వర్షాలు సమృద్ధిగా కురవగానే జిల్లా వ్యాప్తంగా వనమహోత్సవాన్ని పకడ్బందీగా చేపట్టి లక్ష్యానికి అనుగుణంగా పూర్తి చేసేందుకు అధికారులు ముందుకు సాగుతున్నారు.

సాయుధ పోరాటానికి కొమరయ్య ఆద్యుడు

అదనపు కలెక్టర్ శ్రీనివాస్



దొడ్డి కొమరయ్య చితపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్

నల్లగొండ టౌన్, జూలై 4: భూమి, భుక్తి కోసం చేసిన పోరాటం తెలంగాణ సాయుధ పోరాటానికి దారితీసిందని, ఈ పోరాటంలో ప్రాణాలను కోల్పోయిన దొడ్డి కొమరయ్య అందుకు ఆద్యుడిగా నిలిచారని అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ అన్నారు. గురువారం దొడ్డి కొమరయ్య వర్ధంతి సందర్భంగా కలెక్టరేట్‌లో కొమరయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ సాయుధ పోరాటం అనగానే గుర్తుకు వచ్చేది దొడ్డి కొమరయ్య అని అన్నారు. తెలంగాణ సాయుధ పోరాటానికి కొమరయ్య ఆద్యుడిని అన్నారు. అలాంటి మహానుభావుల త్యాగాల ఫలితమే తెలంగాణ అని అన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి డి.రాజ్యలక్ష్మి, హౌసింగ్ పీడీ, బీసీ సంక్షేమశాఖ ఇన్‌చార్జి అధికారి రాజ్ కుమార్, కలెక్టరేట్ ఏవో మోతిలాల్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసమే 'ప్రజావాణి'

అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర



ప్రజావాణిలో బాధితులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర

వేములపల్లి, జూలై 4: గ్రామీణ ప్రాంతాల్లో సమస్యల సత్వర పరిష్కారం కోసమే పంచాయతీల స్థాయిలో 'ప్రజావాణి' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన 'ప్రజావాణి'లో ఆయన మాట్లాడారు. వానాకాలం అయినందున సీజనల్ వ్యాధులపై సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. తాగునీటి ట్యాంక్‌లను శుభ్రంచేసి వీధుల వెంట బ్లీచింగ్ చల్లించాలన్నారు. గ్రామస్థాయి నోడల్ అధికారి, పంచాయతీ కార్యదర్శి, హెల్త్ సిబ్బంది, ఇతర శాఖల అధికారులను సమన్వయం చేసుకుంటూ గ్రామాల్లో పారిశుధ్యంపై దృష్టిసారించాలన్నారు. సీజనల్ వ్యాధులను దృష్టిలో ఉంచుకొని వైద్యసిబ్బంది అవసరమైన మందులను ముందస్తుగా సమకూర్చుకోవాలన్నారు. అధికారులు 'ప్రజావాణి'లో సకాలంలో పాల్గొని ప్రజల దరఖాస్తులు తీసుకొని వాటిని త్వరితగతిన పరిష్కరించాలన్నారు. 'ప్రజావాణి'పై నిర్లక్ష్యంగా వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాస్‌రావు, ఎంపీడీవో శారదాదేవి, పంచాయతీ కార్యదర్శి శ్రవణ్, ఏఎన్ఎం శైలజ, ఎఫ్ఏ తులసీ, తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల విషయంలో రాజీపడొద్దు

ఎస్పీ శరత్‌చంద్ర పవార్



చిట్యాలలో జాతీయ రహదారిపై బ్లాక్‌స్పాట్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నార్కట్‌పల్లి, జూలై 4: శాంతిభద్రతల విషయంలో రాజీపడొద్దని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ పోలీసులకు సూచించారు. గురువారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను ఆయన తనిఖీచేశారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైన కేసులు, జాతీయ రహదారిపై బ్లాక్‌స్పాట్ల వివరాలను ఎస్ఐని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బాధ్యుల విషయంలో కఠినంగా, బాధితుల విషయంలో ఫ్రెండ్లీగా వ్యవహరించాలన్నారు. తద్వారా నేరాలను అదుపులోకి తీసుకురావడంతో పాటు పోలీసులపై ప్రజల్లో విశ్వాసం పెరుగుతుందన్నారు. కాగా, తొలిసారి వచ్చిన ఎస్పీకి ఎస్ఐ అంతిరెడ్డి, కానిస్టేబుళ్లు గౌరవ వందనం సమర్పించారు. ఎస్పీ వెంట డీఎస్పీ శివరాంరెడ్డి, సీఐ నాగరాజు ఉన్నారు.

రోడ్డు ప్రమాదాలకు నివారణకు చర్యలు

చిట్యాల: జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్పీ శరత్‌చంద్ర పవార్ తెలిపారు. గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌ను తనిఖీచేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న రైల్వేస్టేషన్ వద్ద జంక్షన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వాహనదారులు ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. 100కు వచ్చిన కాల్స్‌పై పోలీసులు వెంటనే స్పందించాలన్నారు. జాతీయ రహదారి మీదుగా అక్రమంగా రవాణా అవుతున్న గంజాయిపై నిఘా పెంచాలన్నారు. అందుకు పకడ్బందీగా వాహనాలను తనిఖీ చేయాలని ఆదేశించారు. జాతీయ రహదారిపై నిరంతరం పెట్రోలింగ్ కొనసాగించాలని సూచించారు. ఎస్పీ వెంట సీఐ నాగరాజు, ఎస్ఐ సైదాబాబు ఉన్నారు.

కేతేపల్లి: ఎస్పీ శరత్‌చంద్ర పవార్ గురువారం కేతేపల్లి, నకిరేకల్ పోలీస్‌స్టేషన్లను తనిఖీ చేశారు. 65వ నెంబర్ జాతీయ రహదారిపై బ్లాక్ స్పాట్లు, పోలీస్‌స్టేషన్ పరిధిలో జాతీయ రహదారిపై జరుగుతున్న ప్రమాదాలు, మండలంలో నమోదైన నేరాల సంఖ్య తదితర వివరాలను ఎస్ఐలను అడిగి తెలుసుకున్నారు. జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు ప్రత్యేకంగా తీసుకుంటున్న చర్యలపై పోలీస్ సిబ్బందితో చర్చించారు. హైవేపై ఎన్ని సీసీ కెమెరాలు, ఉన్నాయి. అందులో ఎన్ని పనిచేస్తున్నాయనే వివరాలను సేకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారితో స్నేహపూర్వకంగా వ్యవహరిస్తూ, కేసుల పరిష్కారంలో జాప్యం చేయకుండా తక్షణం స్పందించాలన్నారు. పలు కేసుల పరిష్కారంలో జరుగుతున్న జాప్యంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. ఎస్పీ వెంట సీఐలు శ్రీనివాసరెడ్డి, రాజశేఖర్, ఎస్ఐలు ఎ.శివతేజగౌడ్, గోపికృష్ణ, సుధీర్‌కుమార్, తదితరులు ఉన్నారు.

డీసీసీబీకి అధిక నిధులు కేటాయించాలి

మంత్రి తుమ్మలకు డీసీసీబీ చైర్మన్ వినతి



మంత్రి తుమ్మలను సన్మానిస్తున్న డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి

నల్లగొండ, జూలై 4: జిల్లా సహకార కేంద్ర బ్యాంకు(డీసీసీబీ)కి ప్రభుత్వం నుంచి అధిక నిధులు కేటాయించాలని వ్యవసాయ, కోఆపరేటివ్‌శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి కోరారు. గురువారం హైదరాబాద్‌లో తుమ్మల నాగేశ్వర్‌రావును కలిసి పలు అంశాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. డీసీసీబీ బ్యాంకుల నుంచి రైతులు తీసుకున్న రుణాలను మాఫీ చేయాలని కోరారు. అనంతరం మంత్రిని బ్యాంక్ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్లు సన్మానించారు.

ఆర్టీసీ సిబ్బందిపై దాడి చేస్తే కఠిన చర్యలు : ఆర్ఎం

నల్లగొండ, జూలై 4: విధుల్లో ఉన్న ఆర్టీసీ సిబ్బందిపై దాడి చేయడం నేరమని, వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్టీసీ రీజనల్ మేనేజర్ ఎం.రాజశేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దాడికి పాల్పడిన వారికి రెండేళ్ల నుంచి గరిష్ఠంగా పదేళ్ల వరకు కోర్టు జైలు శిక్ష, జరిమానా విధించే అవకాశం ఉందన్నారు. అదేవిధంగా ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిధి నుంచి సూపర్ లగ్జరీ బస్సుల్లో తిరుపతి వెళ్లే ప్రయాణికులకు చార్జీలో 10శాతం రాయితీ ఇవ్వనున్నట్టు ఆయన తెలిపారు. తిరుపతి ప్రయాణికులు వెళ్లడానికి, తిరిగి రావడానికి ఒకేసారి టికెట్ రిజర్వేషన్ చేయించుకుంటే 10శాతం రాయితీ వర్తిస్తుందన్నారు. అవకాశాన్ని ఉమ్మడి జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

• జోరుగా సాగుబడి







జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాలకు వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. ఇప్పటికే వరి నరుమడులు సిద్ధం కాగా, రైతులు నాట్లు వేయించే పనుల్లో బిజీగా ఉన్నారు. మరోవైపు మెట్ట భూముల్లో ఆరుతడి పంటలు సాగుచేస్తున్న రైతులు చేలల్లో గుంటుక తోలుతున్నారు. నాట్లు పూర్తయిన రైతులు ఎరువులు చల్లుతున్నారు. మొత్తంగా గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ పనులు ముమ్మరం కాగా, పంటచేలు పచ్చని తివాచీలా పల్లెలకు ప్రకృతి శోభను అద్దుతున్నాయి.

● ఫొటోలు : స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నల్లగొండ

గోపాలమిత్రలను క్రమబద్ధీకరించాలి




సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి సమస్యలు వివరిస్తున్న గోపాలమిత్ర జేఏసీ నాయకులు

సీఎం రేవంత్‌రెడ్డికి గోపాల మిత్ర జేఏసీ వినతి

నల్లగొండ, జూలై 4: పశుసంవర్థక శాఖలో 23 ఏళ్లుగా పనిచేస్తున్న గోపాలమిత్రలను ప్రభుత్వ ఉద్యోగులుగా క్రమబద్ధీకరించాలని గోపాలమిత్ర జేఏసీ రాష్ట్ర కన్వీనర్ మాదబోయిన రవీంద్రముదిరాజ్ కోరారు. గురువారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గోపాలమిత్రలు పశువులకు టీకాలు వేయడం, బీమా ఇతర సేవలను పశువైద్యుల పర్యవేక్షణలో అందిస్తున్నారన్నారు. ఏటా 14లక్షల పశువులకు కృత్రిమ గర్భధారణ చేయడంతో ఇప్పటి వరకు సుమారు 3లక్షల దూడలకు జన్మనిచ్చాయన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలను విజయవంతం చేయడంలో గోపాలమిత్రలు కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 1,530మంది 23 ఏళ్లుగా సేవలందిస్తున్నారని వారిని క్రమబద్ధీకరించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న తొమ్మిది నెలల వేతనం ఇవ్వడంతో పాటు 21 నెలల పీఆర్సీ బకాయిలు చెల్లించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందని, ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గోపాలమిత్ర జేఏసీ నాయకులు పల్సా మహేశ్వర్, మూడావత్ దశరథ్, రఘురామకృష్ణ, బందయ్య, బుచ్చిరెడ్డి, శివరామకృష్ణ, ఎండీ ఫరూక్, ఎండీ ఫయాజ్, తదితరులు పాల్గొన్నారు.









పెద్దచెరువుకు జలకళ





భువనగిరి పెద్దచెరువు

చెరువు నిండితే.. ఆ ఊరి కడుపు నిండినట్టే. సమృద్ధి పంటలు, చేతివృత్తులకు చేతినిండా పని, మత్స్యకారుల ఆర్థిక పరిపుష్టికి ఎందో దోహదమవుతాయి. ఇటీవల కురిసిన వర్షాలకు భువనగిరి పెద్దచెరువు జలకళను సంతరించుకుంది. చెరువు నిండా నీరు ఉండడంతో అటుగా వెళుతున్న వాహనదారులు, ప్రయాణికులు చెరువుల అందాలను తిలకిస్తూ ముందుకు సాగుతున్నారు.

● స్టాఫ్ ఫొటోగ్రాఫర్, యాదాద్రి భువనగిరి



నిండు కుండలా భువనగిరి పెద్దచెరువు

నృసింహుడి జూన్ ఆదాయం రూ.23.91కోట్లు

యాదగిరిగుట్ట ఆలయ ఈవో భాస్కరరావు

యాదాద్రి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి దేవస్థాన ఖజానాకు జూన్ నెలలో మొత్తం రూ.23,91,09,020ఆదాయం సమకూరిందని ఆలయ ఈవో ఎ.భాస్కర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రసాద విక్రయం ద్వారా రూ.4,85,71,780, హుండీ రూ.3,48,12,940, వీఐపీ దర్శనం రూ.1,90,95,450, ఆర్జిత సేవలు రూ.87,54,503, బ్రేక్ దర్శనం రూ.80,49,900, వ్రతమండపం రూ.36,14,200, విచారణ శాఖ రూ.38,83,183, ఇతరముల ద్వారా రూ.11,23,27,064 వరకు ఆదాయం సమకూరిందని, జూన్ 2023లో రూ.16,36,04,962 ఆదాయం సమకూరిందని తెలిపారు. గతంతో పోలిస్తే ఈ సారి రూ.7,55,04,058 వరకు ఎక్కువ ఆదాయం సమకూరిందన్నారు. స్వామివారి దర్శనం కోసం విచ్చేసే భక్తుల కోసం సౌకర్యాలు మెరుగుపరుస్తున్నామని తెలిపారు. గిరి ప్రదక్షిణ దారిలో సిమెంట్ ప్లేవర్స్‌టైల్స్ ఏర్పాటుచేశామని, 5వేల మందితో స్వాతినక్షత్రం రోజున గిరి ప్రదక్షిణ ప్రారంభించినట్టుపేర్కొన్నారు. భక్తులకు రోజుకు 600నుంచి వేయిమందికి వరకు అన్నప్రసాద సౌకర్యం, వినాయక నాట్యమండలి సురభి బృందంతో నాలుగు రోజుల పాటు నాటకాలు ప్రదర్శించినట్లు తెలిపారు. స్థానికులకు ప్రతి మంగళవారం ఉదయం 8.30నుంచి 9గంటల వరకు ఉచితంగా గర్భాలయ దర్శనం, 54,213 మంది భక్తులు తలనీలాలు, 508బస్సుల ద్వారా 9,56,514 మంది భక్తులను కొండపైకి ఉచిత బస్సు రవాణా కల్పించామని పేర్కొన్నారు.

అవమాన భారంతో వివాహిత ఆత్మహత్యాయత్నం

● వేధింపుల ఘటనతో ఇరువర్గాలపై కేసులు ● యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరులో ఘటన

అడ్డగూడూరు, జూలై 4: ఓ మహిళపై వేధింపుల ఘటన ఇరువర్గాలపై కేసులు నమోదుకాగా, అవమాన భారం భరించలేక ఓ వివాహిత ఆత్మహత్యాయత్నం చేసింది. యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరులో ఈ సంఘటన జరగింది. ఎస్ఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గట్టుసింగారం గ్రామానికి చెందిన దుర్శోజు రవీంద్రాచారి అదే గ్రామానికి చెందిన సట్టు శైలజను ఏడాదిగా వెంబడిస్తూ అసభ్యకరంగా సైగలు చేస్తున్నాడని సదరు మహిళ తన భర్త సట్టు రవికి విషయం చెప్పింది. దీంతో రవితోపాటు ఆయన సోదరుడు సట్టు పరుశురాములు, మరికొంతమంది రవీంద్రాచారి ఇంటికి వెళ్లి నిలదీశారు. దీంతో రవీంద్రాచారి, ఆయన భార్య అసభ్యంగా తిట్టి, శైలజ, రవిని నెట్టేశారని, ఈ విషయంపై శైలజ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఇదిలా ఉంటే తన ఇంటిపైకి వచ్చి భార్య రాజేశ్వరి, కుమారుడు శివపై దాడి చేశారని రవీంద్రాచారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అవమాన భారంతో..

అవమాన భారంతో రవీంద్రాచారి భార్య రాజేశ్వరి ఆత్మహత్యాయత్నం చేఇంది. సట్టు రవి, సట్టు పరుశురాములు పలువురితో కలిసి వచ్చి ఈ నెల 1వ తేదీన అర్ధరాత్రి రవీంద్రాచారి భార్య రాజేశ్వరి, కుమారుడు శివపై దాడి చేశారని, ఈ విషయమై 100కి ఫోన్ చేయగా పెట్రోలింగ్ పోలీసులు సంఘటన స్థలానికి వచ్చారని మరుసటి రోజు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో రవీంద్రాచారి భార్య రాజేశ్వరి ఫిర్యాదు చేశారు. ఈ విషయంలో కొంతమంది నాయకులు, పోలీసులు రాజీపడాలని బలవంతం చేసినట్లు రవీంద్రాచారి ఆరోపించారు. ఇదిలా ఉండగా ఈ నెల 3వ తేదీన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పోలెబోయిన లింగయ్య.. దుర్శోజు రవీంద్రాచారిని సస్పెండ్ చేస్తున్నట్లు సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఇన్ని అవమానాలు తట్టుకోలేక రవీంద్రాచారి భార్య రాజేశ్వరి గురువారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. చికిత్సకోసం తిరుమలగిరి మండల కేంద్రానికి తరలించగా, పరిస్థితి విషమంగా ఉండటంతో సూర్యాపేట ఏరియా ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు.

ప్రజాసేవకు విరమణ లేదు



కొండమల్లేపల్లి ఎంపీపీ దంపతులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

● ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

దేవరకొండ, జూలై 4: సమాజంలో ప్రభుత్వ అధికారులకు తప్ప ప్రజాప్రతినిధులకు పదవీ విరమణ ఉండదని, నిత్యం ప్రజాసేవలోనే కొనసాగడానికే అవకాశం ఉంటుందని రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ కే శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం కొండమల్లేపల్లిలో నిర్వహించిన ఎంపీపీ, వైస్‌ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీల పదవీ విరమణ సన్మాన కార్యక్రమానికి ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు సేవ చేయాలనే దృక్పథం ఉన్నప్పుడు ప్రజాప్రతినిధులకు ప్రజల్లో మంచి ఆదరణ ఉంటుందన్నారు. తన కుమార్తె కొండమల్లేపల్లి నూతన మండలంగా ఏర్పడి మొదటి ఎంపీపీగా ప్రజల ఆదరణను పొందడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం ఎమ్మెల్యే బాలునాయక్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రజాప్రతినిధుల పాత్ర కీలకమన్నారు. ఎంపీపీ దూదిపాల రేఖారెడ్డి సామాజిక సేవా కార్యక్రమాలను ఎమ్మెల్యే ప్రశంసించారు. అనంతరం పదవీకాలం ముగిసిన ప్రజాప్రతినిధులను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ దూదిపాల రేఖశ్రీధర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ కాసర్ల వెంకటేశ్వర్లు, టీయూడబ్ల్యూజే(ఐజేయూ) రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్‌అలీ, మధుసూదన్‌రెడ్డి, జడ్పీటీసీ సరస్వతమ్మ, ఎంపీడీవో రాంరెడ్డి, దేవరకొండ మునిసిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, కోఆప్షన్ మెం బర్ సిరాజ్‌ఖాన్, నాయిని మాధవరెడ్డి, వేమన్‌రెడ్డి, లక్కిదాస్, కొర్ర రాం సింగ్, యుగంధర్‌రెడ్డి, కుంభం శ్రీనివాస్‌గౌడ్, గంధం సురేష్ తదితరులు పాల్గొన్నారు.


ప్రెస్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యాలయం ప్రారంభం

కొండమల్లేపల్లి మండలంలోని ఎస్‌వీ కాంప్లెక్స్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన కొండమల్లేపల్లి ప్రెస్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యాలయాన్ని రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ కే శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్‌తో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ ఆధ్వర్యంలో జర్నలిస్టులకు మంచి సహకారం అందే అవకాశం ఉందన్నారు. కొండమల్లేపల్లి జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వడానికి ప్రభుత్వం తరపున ఎమ్మెల్యే కృషి చేయాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే జర్నలిస్టులకు న్యాయం జరిగిందని, ఇప్పుడు కూడా కాంగ్రెస్ ప్రభుత్వం జర్నలిస్టులకు తగిన న్యాయం చేస్తుందన్నారు. కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే(ఐజేయూ) ప్రెసిడెంట్ విరాహత్‌అలీ, జిల్లా అధ్యక్షుడు గార్లపాటి కృష్ణారెడ్డి, జిల్లా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు పులిమామిడి మహేందర్‌రెడ్డి, గాదె గిరిధర్‌రావు, మాధవరెడ్డి, ఉట్కూరి వేమన్‌రెడ్డి, ఏరుకొండ రాము పాల్గొన్నారు. అదేవిధంగా మార్కెట్ యార్డులో జరిగిన దేవరకొండ డివిజన్ వర్కింగ్ జర్నలిస్టు సమావేశంలో తెలంగాణ రాష్ట్ర ఐజేయూ అధ్యక్షుడు విరాహత్‌అలీ మాట్లాడారు.

సీఎం అవుతావని రేవంత్‌రెడ్డికి ఆనాడే చెప్పా

● క్షమాభిక్షపై విడుదలైన ఖైదీ నాగయ్య

నిడమనూరు, జూలై 4: ప్రజల కోసం పోరాడుతున్న తపన చూసి మీరు తప్పకుండా ముఖ్యమంత్రి అవుతారని సీఎం రేవంత్‌రెడ్డికి జైలులో ఆనాడే చెప్పానని క్షమాభిక్ష ఖైదీ తరి నాగయ్య అన్నారు. భార్య మీద కోపంతో క్షణికావేశంలో కుమారుడిని కాల్వలో ముంచి చంపిన కేసులో 16 ఏళ్ల శిక్ష అనుభవించి ప్రభుత్వ క్షమాభిక్షతో జైలు నుంచి ఇటీవల విడుదలైన నల్లగొండ జిల్లా నిడమనూరు మండలం గుంటుకగూడెం గ్రామానికి చెందిన తరి నాగయ్య. విలేకరులతో జైలు అనుభవం పంచుకున్నారు. తాను తెలియక చేసిన తప్పుకు తనను నల్లగొండ జైలుకు తరలించక ముందు మొదట చర్లపల్లి జైలులో ఖైదీగా శిక్ష అనుభవించానని తెలిపారు. అక్కడ ఉన్న సమయంలోనే ఓటుకు నోటు కేసులో ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి కూడా చర్లపల్లి జైలుకు రిమాండ్ ఖైదీగా వచ్చారని గుర్తుచేశారు. జైలులో ఆయనకు సహాయకుడిగా పనిచేశానని, రేవంత్‌రెడ్డితో అనేక విషయాలపై మాట్లాడానని తెలిపారు. ప్రజల కోసం ఆయన ఎంతో తపన పడేవారన్నారు. ఆయన తపన చూసి కచ్చితంగా సీఎం అవుతాడని, ఆయనతో పాటు ఖైదీలకు కూడా ఆనాడే చెప్పానన్నారు. జీవిత ఖైదీలకు క్షమాభిక్ష కోసం ఒత్తిడి తేవాల్సిందిగా అప్పట్లో ఆయన్ను అనేకసార్లు కోరానని తెలిపారు. జైలు నుంచి విడుదలైన తర్వాత తమకు బతుకుదెరువు కోసం ఉపాధి కల్పిస్తానని ఆనాడే రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారన్నారు. రేవంత్‌రెడ్డి సీఎం అయిన తర్వాతే తనలాంటి అనేక మంది జీవిత ఖైదీలకు క్షమాభిక్షకు మోక్షం లభించిందన్నారు. అనేక ఇంటర్వ్యూల్లో రేవంత్‌రెడ్డి తన పేరు ప్రస్తావించాడని గుర్తుచేశారు. త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలుస్తాననాన్నరు. తెలియక చేసిన తప్పుకు తాను 16 ఏళ్ల జైలులో గడిపానని, శేష జీవితం కుటుంబంతో ఆనందంగా గడిపేందుకు ప్రయత్నిస్తానని తెలిపారు. సీఎం తనకు ఉపాధి కల్పించాలని నాగయ్య అన్నారు.



తరి నాగయ్య

మాటు వేసి.. వెంబడించి

● ఉపాధ్యాయురాలి ఆభరణాలతో చైన్ స్నాచర్ల పరారీ



సీసీ ఫుటేజీలో రికార్డైన అనుమానితులు

నాగార్జున సాగర్, జూలై 4: ఆమె ప్రభుత్వ ఉపాధ్యాయురాలు... విధులు ముగించుకుని గురువారం సాయంత్రం తన స్కూటీపై పాఠశాల నుంచి బయలుదేరారు. అప్పటికే మాటు వేసిన ఇద్దరు చైన్ స్నాచర్లు ద్విచక్ర వాహనంపై ఆమెను అనుసరించారు. సుమారు 20కిలోమీటర్ల దూరం వెంబడించి ఆమె మెడలో ఉన్న నాలుగు తులాల తాళిబొట్టు, బంగారు గొలుసు అపహరించారు. నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్‌లోని హిల్‌కాలనీలో ఈ సంఘటన జరిగింది. సాగర్ సీఐ భీసన్న, బాధితురాలు రూపారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నాగార్జునసాగర్‌లోని హిల్‌కాలనీకి చెందిన మెట్ల రూపారెడ్డి పెద్దవూర జెడ్పీహెచ్‌ఎస్‌లో ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్నారు. గురువారం సాయంత్రం విధులు ముగించుకుని ఐదు గంటల సమయంలో తన స్కూటీపై పెద్దవూర నుంచి నాగార్జునసాగర్‌కు బయలుదేరారు. ఈ క్రమంలో పెద్దవూర చౌరస్తా నుంచి ద్విచక్ర వాహనంపై ఇద్దరు దుండగులు ఉపాధ్యాయురాలి స్కూటీని అనుసరించి వస్తున్నారు. నాగార్జునసాగర్‌లోని హిల్‌కాలనీ నర్సరీ వద్ద జనసంచారం లేదని గమనించిన దుండగులు స్కూటీపైనే ఉన్న ఉపాధ్యాయురాలి మెడలోని నాలుగు తులాల తాళి బొట్టు, బంగారు గొలుసు లాక్కొని మాచర్ల వైపు పరారయ్యారు. ఉపాధ్యాయురాలు స్కూటీపై నుంచి కింద పడిపోవడంతో ఆమెకు స్వల్ప గాయాలయ్యాయి. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. సాగర్‌లోని అన్ని కూడళ్లలోని సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు.

జాబ్‌మేళాకు 400మంది విద్యార్థులు హాజరు

నల్లగొండ, జూలై 4: మహాత్మాగాంధీ యునివర్సిటీలో గురువారం నిర్వహించిన జాబ్ మేళాకు 400మంది విద్యార్థిని విద్యార్థులు హాజరయ్యారని ఎంజీయూ ప్లేస్‌మెంట్ సెల్ డైరెక్టర్ డాక్టర్ వై. ప్రశాంతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీ, నాన్‌ఐటీ రంగాల్లో అవకాశాలకు బీటెక్, ఎంసీఏ, బీఎస్సీ కంప్యూటర్స్‌లతో పాటు ఇతర డిగ్రీల అర్హతతో విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. 150 మందికి పైగా విద్యార్థులు ఆన్‌లైన్ ఇంటర్వ్యూలో కూడా పాల్గొన్నారన్నారు. పరీక్షలతో పాటు ఇంటర్వ్యూలతో ఆయా కంపెనీలకు ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు.

బైక్ అదుపుతప్పి యువకుడు మృతి



రాఘవేంద్రచారి(ఫైల్)

మర్రిగూడ, జూలై 4: బైక్ అదుపుతప్పి కిందపడి యువకుడు మృతిచెందాడు. ఈ సంఘటన మండలంలోని సరంపేట గ్రామ శివారులో బుధవారం రాత్రి జరిగింది. ఎస్‌ఐ రంగారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రాఘవేంద్రచారి(35) రాంరెడ్డిపల్లి గ్రామంలో తన బంధువుల ఇంట్లో జరిగిన శుభకార్యానికి బుధవారం వెళ్లాడు. రాఘవేంద్రచారి అదేరోజు రాత్రి బైక్‌పై తన స్వగ్రామానికి వస్తుండగా మార్గమధ్యలోని మత్స్యగిరి లక్ష్మీనర్సింహ్మస్వామి దేవాలయంలో సమీపంలో బైక్ అదుపు తప్పి కింద పడిపోయాడు. గురువారం ఉదయం సరంపేట గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తన పొలం పనుల నిమిత్తం వెళ్తుండగా దారి పక్కన పడి ఉన్న రాఘవేంద్రచారిని గుర్తించి ఆయన భార్యకు సమాచారం ఇచ్చాడు. వెంటనే ఆమె సంఘటనా స్థలానికి వెళ్లి చూసింది. అప్పటికే రాఘవేంద్రచారి మృతిచెంది ఉన్నాడు. భార్య ఉషారాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

45 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత



పోలీసులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం

కొండమల్లేపల్లి, జూలై 4: వాహనంలో తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి చౌరస్తా వద్ద పోలీసులు గురువారం పట్టుకున్నారు. కొండమల్లేపల్లిలో వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులకు అనుమానాస్పదంగా వెళ్తున్న బొలెరో వాహనంలో కన్పించింది. దానిని ఆపి తనిఖీ చేయగా 45బస్తాల రేషన్ బియ్యం ఉండడంతో స్వాధీనం చేసుకున్నారు. ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రామ్మూర్తి తెలిపారు.

ఉద్యోగి ఆత్మహత్య



మోషయ్య(ఫైల్)

మేళ్లచెర్వు, జూలై 4: సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండల పరిధిలోని దొండపాడు ప్రాథమిక పశు వైద్య కేంద్రంలో వెటర్నరీ అసిస్టెంట్ కార్యాలయ ఆవరణలోనే బుధవారం రాత్రి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్‌ఐ సైదిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. చిలుకూరు మండలం కొండాపురం గ్రామానికి చెందిన పెరుమాళ్ళ మోషయ్య(51) చింతలపాలెం మండల పరిధిలోని దొండపాడు ప్రాథమిక పశువైద్య కేంద్రంలో పది సంవత్సరాలుగా వెటర్నరీ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. కుటుంబ కలహాలతో కొంతకాలంగా భార్యాభర్తలు విడిగా ఉంటున్నారు. మోషయ్య దొండపాడు గ్రామంలోని తన తండ్రి వద్ద నివాసముంటున్నాడు. గురువారం ఉదయం ఆరు గంటల సమయంలో పశువైద్య కేంద్రంలోని వరండాలో కొక్కానికి చీరతో ఉరి వేసుకుని ఉన్న మోషయ్యను స్థానికులు గమనించారు. వెంటనే తండ్రి వీరయ్యకు సమాచారం ఇచ్చారు. అప్పటికే ఆయన మృతిచెంది ఉన్నాడు. మోషయ్య తండ్రి వీరయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మోషయ్యకు ఇద్దరు కుమారులు ఉన్నారు.

శాస్త్రోక్తంగా నిత్య పూజలు


భువనగిరి అర్బన్, జూలై 4: యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి దివ్యక్షేత్రంలో నిత్య కైంకర్యాలు పాంచారాత్రగమశాస్త్ర రీతిలో గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రభాతవేళ సుప్రభాతంతో స్వామిఅమ్మవార్లను మేల్కొలిపి అర్చకస్వాములు గర్భగుడిలో కొలువుదీరిన స్వయంభువులను, సువర్ణ ప్రతిష్ఠామూర్తులను వేదమంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల నడుమ అభిషేకించి తులసీ దళాలతో సహస్రనామార్చన జరిపారు. ప్రధానాలయ అష్టభుజి ప్రాకార మండపంలో స్వామి అమ్మవార్లను ముగ్ధమనోహరంగా అలంకరించి ప్రత్యేక వేదికపై తీర్చిదిద్ది సుదర్శన శతక పఠనాలతో హవనం నిర్వహించారు. అనంతరం గజవాహన సేవలో ఊరేగించి విశ్వక్సేనుడి తొలిపూజలతో నిత్యతిరుకల్యాణోత్సవ పర్వాలు ఆగమశాస్త్రరీతిలో చేపట్టారు. సాయంత్రం ప్రధానాలయ ముఖమండపంలో దర్బారు సేవోత్సవం చేపట్టిన ఆచార్యులు అలంకార వెండి జోడు సేవలు, సహస్రనామార్చనలు నిర్వహించారు. పాతగుట్ట ఆలయంలో నిత్య కైంకర్యాలు వేదమంత్రాలు మంగళవాయిద్యాల నడుమ వైభవంగా జరిపారు. కొండపైన శివాలయంలో పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామికి రుద్రహవనం శైవాగమ పద్ధతిలో నిర్వహించారు. వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ.19,12,316 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో భాస్కర్‌రావు తెలిపారు.



ప్రాకార మండపంలో నిత్యకల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

చెత్త కుప్పలకు నిలయంగా..

● డబుల్ బెడ్‌రూం ఇళ్ల పక్కనే చెత్త డంప్ ● 18నెలల క్రితం పేదలకు ఇళ్లు కేటాయింపు ● సౌకర్యాలు లేక అప్పగించని అధికారులు



డబుల్‌బెడ్‌రూం ఇళ్ల స్థలాల్లో పేరుకపోయిన చెత్త కుప్పలు



బీబీనగర్, జూలై 4: అవి పేదల కోసం నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లు. సౌకర్యాలు లేకపోవడంతో నివాసయోగ్యంగా లేని లబ్ధిదారులూ ఉండడం లేదు. 18నెలలు గడుస్తున్నా వాటి గురించి ఎవరూ పట్టించు కోవడం లేదు. ఇంకేముందు కొందరు ప్రబుద్ధులు డబుల్ బెడ్‌రూం ఇళ్ల ప్రాంతాన్ని చెత్త డంపింగ్ యార్డుగా మార్చి దర్జాగా చెత్త వేస్తున్నారు. నిత్యం చెత్త కుప్పలు తగులబెడుతూ కాలుష్యాన్ని కలుషితం చేస్తున్నారు. బీబీనగర్ పట్టణ శివారులో భూదాన్‌పోచంపల్లికి వెళ్లే ప్రధాన దారిని ఆనుకుని ఉన్న ప్రభుత్వ స్థలంలో డబుల్ బెడ్ రూం ఇళ్ల సముదాయం నిర్మించారు. లబ్ధిదారులకు ఇళ్లు కేటాయించని అధికారులు, నివాసం ఉండడానికి అవసరమైన సదుపాయాలు కల్పించడం లేదు. దీంతో ఏడాదిన్నర కాలంగా వాటిని లబ్ధిదారులకు అప్పగించలేదు. పేదల సొంతింటి కల నెరవేరకపోగా, నిరుపయోగంగా చెత్త కుప్పలకు నిలయంగా మారి దుర్వాసన వెదజల్లుతోంది. బీబీనగర్‌లోని ఎయిమ్స్ ఆస్పత్రిలో వాడి పడేసిన వైద్య పరికరాలు, ఇతరత్ర వ్యర్థాలను ట్రాక్టర్ల ద్వారా తీసుకొచ్చి ఇక్కడే పారబోస్తుండడంతో వ్యర్థాలన్నీ గుట్టలుగా మారాయి. వాని నిప్పు పెట్టి తగులబెడుతుండడంతో దుర్వాసనతో కూడిన పొగ వస్తోంది. ఈగల మోతతో ఇక్కడి పరిసరాలను కలుషితం చేస్తున్నాయి.

సొంతింటి కల నెరవేరేది ఎప్పుడో?

బీబీనగర్- భూదాన్‌పోచంపల్లి రోడ్డు మార్గంలో సర్వే నెంబర్ 495/1లో రెండు ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి 2017 జూలై 24న అప్పటి ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి 40 ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్మాణ వ్యయం భారంగా మారడంతో కాంట్రాక్టర్లు ఇళ్ల నిర్మాణాలను మధ్యలోనే ఆపేశారు. ప్రజల నుంచి వ్యతిరేక వస్తుండడంతో కొండమడుగులో 30 ఇళ్లు, బీబీనగర్‌లో 40 ఇళ్లకు 11 ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేశారు. లబ్ధిదారుల ఎంపిక చేసేందుకు గత ప్రభుత్వం దరఖాస్తులు ఆహ్వానించింది. బీబీనగర్‌లోని 11డబుల్‌బెడ్ రూం ఇళ్ల కోసం 359 మంది దరఖాస్తు చేసుకోగా, అందులో 157మందిని అర్హులుగా గుర్తించారు. 2023 ఫిబ్రవరి 17వ తేదీన రిజర్వేషన్ల వారీగా లక్కీ డ్రా ద్వారా 11మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. ఎస్సీలకు-4, ఎస్టీలకు-2, మైనార్టీకి- 1, బీసీ, ఓసీలకు-4 చొప్పున ఇళ్లు కేటాయించారు.



కుప్పలు తెప్పలుగా ఎయిమ్స్ ఆస్పత్రి వ్యర్థాలు

చర్యలు తీసుకుంటాం

నేను ఇక్కడ విధుల్లో చేరకముందే డబుల్‌బెడ్ రూం ఇళ్ల స్థలాల పక్కన చెత్త డంప్ చేస్తున్నట్లు నా దృష్టికి వచ్చింది. ఎయిమ్స్ నుంచి కూడా మెడిసిన్ రహిత కాటన్ కవర్లను ఇక్కడ పోస్తున్నట్లు తెలిసింది. ఎవరు అనుమతులు ఇచ్చారో తెలుసుకుంటాం. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి నివారణ చర్యలు తీసుకుంటాం. అలాగే లబ్ధిదారులకు త్వరగా ఇళ్లు అప్పగించేందుకు అధికారుల దృష్టికి తీసుకెళ్తా.

● ఇంద్రసేనారెడ్డి, పంచాయతీ కార్యదర్శి బీబీనగర్

మార్కెట్‌లో రూ.10 నోటు

● వ్యాపారులకు ఇబ్బందిగా రూ.10, రూ.20 నోట్లు ● డిజిటల్ చెల్లింపులపైనే ప్రజల మొగ్గు

భూదాన్‌పోచంపల్లి, జూలై 4: మార్కెట్లో చిల్లర డబ్బులు దొరక్క వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అందులోనూ రూ.10 నోట్ల కొరత చాలా ఉంది. మార్కెట్లో రూ.10నోట్ల చెలామణి తగ్గిపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఒకవేళ ఉన్నా చిరిగిపోయినవి చలామణి అవుతున్నాయి. ప్రతి చిన్న వస్తువుకు కొనుగోలుదారుడు ఆన్‌లైన్ పేమెంట్లు చేస్తున్నారు. లేకుంటే రూ.500, రూ.200ల నోట్లు ఇస్తుండడంతో చిల్లర కొరత తలెత్తుతోంది. వాస్తవానికి బ్యాంకుల్లో సైతం డబ్బులు డ్రా చేసిన వారికి ఎక్కువగా రూ.100, రూ.200, రూ.500 నోట్లు ఇస్తుండగా అప్పుడప్పుడూ రూ.20 నోట్లు కూడా వస్తున్నాయి. దీంతో మార్కెట్లో రూ.10నోట్ల చలామణి తగ్గింది. కొనుగోలుదారులకు, అమ్మకందారులకు రూ.10, రూ.20 నోట్ల కొరత ఏర్పడింది. ఈ సమస్యను అధిగమించేందుకు బ్యాంకులు రూ. 10, రూ.20 నోట్ల కోసం ఇండెంట్ పెట్టినప్పుడు రూ.20 నోట్లు, రూ. 50 నోట్లు, రూ. 100 నోట్లు ఎక్కువగా వస్తున్నాయని బ్యాంకు అధికారులు చెబుతున్నారు. దీంతో పది రూపాయల నోట్ల కట్టల కోసం వ్యాపారులు సైతం కావాలని తరుచూ బ్యాంకుకు వచ్చి వెళ్తున్నారని బ్యాంకు అధికారులు చెబుతున్నారు. ఇక డిజిటల్ సేవలు పెరిగి పోవడంతో నోట్ల చలామణి తగ్గిపోవడంతో రూ.10 నోట్లు రానున్న రోజుల్లో మహాభాగ్యమే కానుంది. మార్కెట్లో రూ.10 కాయిన్స్ ఉన్నప్పటికీ వాటిని చెలామణి చేయడం కష్టమవుతుందని, తీసుకుంటే అవి చెల్లవనే భ్రమలో ఇటు వ్యాపారులు, అటు కొనుగోలు దారులు ఉండటంతో పది రూపాయల కాయిన్ పరిస్థితి అగమ్య గోచరంలా మారింది. దీంతో రూ. 10 నోట్లకు భలే డిమాండ్ పెరిగింది.



నోటు చూపుతున్న వినియోగదారుడు

విద్యుదాఘాతంతో ఇద్దరు మృతి





సైదిరెడ్డి కుటుంబసభ్యులను ఓదారుస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

కనగల్, చందంపేట, జూలై 4: విద్యుదాఘాతంతో నల్లగొండ జిల్లాలో గురువారం ఇద్దరు మృతిచెందారు. చందంపేటలో ట్రాన్స్‌ఫార్మర్ నుంచి బోరుకు ఉన్న విద్యుత్ కనెక్షన్ వైరు తెగి మీద పడి యువకుడు, కనగల్ మండలంలోని బాబాసాయిగూడేనికి చెందిన రైతు విద్యుత్ తీగలు తగిలి మృతిచెందాడు. కనగల్ మండలంలోని బాబాసాయిగూడెం గ్రామానికి చెందిన రైతు, నల్లగొండ వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ నల్లబోలు సైదిరెడ్డి(52) గురువారం ఉదయం గ్రామ శివారులోని వ్యవసాయ భూమి వద్దకు వెళ్లాడు. పొలంలో గాలి దుమారానికి తెగిపడిన కరెంట్ వైర్లను సరిచేస్తున్న క్రమంలో సైదిరెడ్డి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. పొలం పక్కనున్న రైతు గమనించి సైదిరెడ్డి కుటుంబసభ్యులకు, పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్త నల్లగొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సైదిరెడ్డి భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రామక్రిష్ణగౌడ్ తెలిపారు. సైదిరెడ్డికి భార్య, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. అందరితో కలివిడిగా ఉండే సైదిరెడ్డి మృతితో బాబాసాయిగూడెంలో విషాదఛాయలు అలుముకున్నాయి. సైదిరెడ్డి మృతదేహానికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబసభ్యులను ఓదార్చారు. సంతాపం తెలిపిన వారిలో నల్లగొండ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ జూకూరి రమేష్, మాజీ జడ్పీటీసీలు మందడి రాంచంద్రారెడ్డి, నర్సింగ్ శ్రీనివాస్‌గౌడ్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గడ్డం అనూప్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

విద్యుత్ వైరు మీదపడి యువకుడు..



అనిల్(ఫైల్)

చందంపేట మండలకేంద్రానికి చెందిన కోమళ్ళ అనిల్(22) గురువారం ఉదయం పొలంలో స్ప్రింక్లర్ పైపులు మారుస్తుండగా ట్రాన్స్‌ఫార్మర్ నుంచి బోరుకు ఉన్న విద్యుత్ కనెక్షన్ తీగ అకస్మాత్తుగా తెగి అనిల్‌పై పడడంతో విద్యుదాఘాతంతో తీవ్రం గాయపడ్డాడు. పొలం వద్ద ఉన్న అతని సోదరుడు గమనించి వెంటనే అతనిని దేవరకొండలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సతీష్‌కుమార్ తెలిపారు. అదేవిధంగా కనగల్ మండలంలోని బాబాసాయిగూడెం గ్రామానికి చెందిన రైతు నల్లబోలు సైదిరెడ్డి(51) గాలి దుమారానికి బోరు మోటర్ వద్ద తెగిపడిన కరెంట్ తీగలను గురువారం ఉదయం సరిచేస్తుండగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. ఆయన నల్లగొండ వ్యవసాయ కమిటీ డైరెక్టర్‌గా కూడా పనిచేస్తున్నారు. సైదిరెడ్డి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ప్రజాసేవలో భాగస్వాములు కావాలి : బీఎల్ఆర్

వేములపల్లి, జూలై 4: పదవీకాలం ముగిసినా ప్రజాహిత సేవలో భాగస్వాములై ప్రజా సంక్షేమానికి కృషిచేయాలని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా వేములపల్లి మండల కేంద్రంలో తాజా మాజీ ఎంపీపీ పుట్టల సునీత ఏర్పాటు చేసిన వీడ్కోలు సన్మాన సభలో ఆయన మాట్లాడారు. పదవితో సంబంధం లేకుండా ప్రజా సేవలో నిరంతరం కృషి చేసే వారికి ఎప్పుడు గుర్తింపు లభించి తగిన పదవులు వరిస్తాయని అన్నారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ పల్లా వీరయ్యను సైతం సన్మానించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తమ్మడబోయిన అర్జున్, డీసీసీ ఉపాధ్యక్షుడు రావు ఎల్లారెడ్డి, పుట్టల పెదవెంకన్న, పుట్టల శ్రీనివాస్, మాజీ సర్పంచులు వల్లంపట్ల రూన్సీ, నాగవెల్లి మధు, రామచంద్రు, పల్లా సోవమ్మ, బుసిరెడ్డి వెంకట్‌రెడ్డి, ధైద గిరి, మాతంగి చంటి, హాజీ తదితరులు పాల్గొన్నారు.

మాడ్గులపల్లి: తమ పదవీకాలం పూర్తయిన ప్రజల్లో ఉంటామని తాజా మాజీ ఎంపీపీ పోకల శ్రీవిద్య అన్నారు. పదవీకాలం పూర్తయిన ప్రజాప్రతినిధులను గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో అధికారులు, సిబ్బంది సన్మానించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ పుల్లెంల సైదులు, జిల్లా కోఆప్షన్ సభ్యుడు మోసిన్‌అలీ, ఎంపీడీవో తిరుమలస్వామి పాల్గొన్నారు.

మర్రిగూడ: పదవీకాలం ముగిసినా ప్రజల మధ్య ఉండి సమస్యలు పరిష్కరించడానికి కృషిచేస్తానని మాజీ ఎంపీపీ గండికోట రాజమణిహరికృష్ణ అన్నారు. మండల అధికారులు సమన్వయంతో మండల అభివృద్ధికి కృషి చేసినట్లు తెలిపారు.



వేములపల్లిలో ఎంపీపీ అనితను సన్మానిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మహిళల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

నార్కట్‌పల్లి, జూలై 4: మహిళల సంక్షేమానికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లిలో ఎంపీడీవో కార్యాలయంలో వివిధ గ్రామాలకు చెందిన 55మంది లబ్ధిదారులకు గురువారం కల్యాణలక్ష్మి చెక్కులు అందజేశారు. ఎల్లారెడ్డిగూడెంలో రూ.20లక్షలతో నిర్మించిన ఆరోగ్య ఉపకేంద్రం భవనాన్ని ప్రారంభించారు. ఎన్నికల్లో మహిళలకు ఇచ్చిన హామీ మేరకు గృహజ్యోతి, ఉచిత కరెంటు, ఉచిత బస్సు సౌకర్యాన్ని అమలు చేశామని, త్వరలో అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు, మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమాల్లో డీఎంహెచ్‌వో కల్యాణ్, ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ కల్లూరి యాదగిరి, ఎంపీటీసీలు పాశం శ్రీనివాస్‌రెడ్డి, పుల్లెంల ముత్తయ్య, చిరుమర్తి యాదయ్య, ఉండ్ర భాగ్యమ్మ, నాయకులు బత్తుల ఊశయ్య, వడ్డే భూపాల్‌రెడ్డి, మేకల వెంకన్న, సాగర్ల సైదులు, దూదిమెట్ల సత్తయ్య, నట్టు సత్తయ్య, సిద్ధగోని స్వామిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నకిరేకల్: గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సిబ్బంది మెరుగైన వైద్య సేవలు అందించాలని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. మండలంలోని నోముల గ్రామంలో రూ.20లక్షలతో నిర్మించనున్న ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్, పీఏసీఎస్ చైర్మన్ నాగులవంచ వెంకటేశ్వర్‌రావు, నకిరేకంటి యేసుపాదం, యాస కర్ణాకర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నార్కట్‌పల్లిలో చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే వీరేశం

బావిలో పడి కాడెద్దు మృతి

చండూరు రూరల్, జూలై 4: పత్తిచేనులో అరకదున్నుతుండగా కాలుజారి బావిలో పడి కాడెద్దు మృతిచెందింది. ఈ ఘటన నల్లగొండ జిల్లా చండూరు మండలంలోని బోడంగిపర్తి గ్రామంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కటుకూరి వెంకన్న తనకున్న వ్యవసాయ భూమిలో పత్తిచేను సాగు చేస్తున్నాడు. గురువారం ఉదయం పత్తిచేనులో గుంటుక కొట్టడానికై మునుగోడు మండలం సానబండ గ్రామానికి చెందిన తన స్నేహితుడు చిలుముల లింగస్వామి దగ్గర బదులుగా అతని కాడెద్లను తీసుకెళ్లాడు. బోడంగిపర్తి గ్రామంలోని తన వ్యవసాయ భూమిలో గుంటుక కొడుతుండగా పక్కనే ఉన్న బావిని గమనించకుండ కాడెద్దు కాలుజారి బావిలో పడిపోయింది. దానితో పాటుగా జతగా ఉన్న మరోకాడెద్దు, నాగలితో సహా బావిలో పడిపోవడంతో ఒక కాడెద్దు మృతిచెందింది. మరో ఎద్దు గాయపడింది. రైతు గ్రామస్థుల సహకారంతో, ట్రాక్టర్ల ద్వారా రెండు ఎద్లను బయటకు తీశారు. ఎద్దు కలేబరాన్ని గ్రామంలో ఖననం చేశారు. గాయపడిన ఎద్దుకు చికిత్స చేయించి సానబండకు తీసుకెళ్లారు. జత ఎద్దు తనతో లేకపోవడంతో కాడెద్దుకు బాటజరగక దిక్కులు చూస్తుండటంతో గ్రామస్థులు కన్నీరు పెట్టారు.

ఆగస్టు 15లోపు రూ.2లక్షల రుణమాఫీ

● నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

పాలకవీడు, జూలై 4: తెలంగాణలో ఆగస్టు 15వ తేదీ లోపు ఏకకాలంలో రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని చేస్తామని, ఇది దేశ చరిత్రలోనే కాంగ్రెస్ ప్రభుత్వ రికార్డని నీటిపారుదల, పౌరసరఫరా శాఖామంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. సూర్యాపేట జిల్లా పాలకవీడులో రూ.24కోట్లతో నిర్మించనున్న తహసీల్దారు కార్యాలయం, పోలీస్‌స్టేషన్ ఇతర ప్రభుత్వ కార్యాలయాలు, మండలంలో వివిధ గ్రామాల్లోని లింక్‌రోడ్లకు గురువారం శంకుస్థాపన చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పింది చేసితీరుతుందన్నారు. మండలానికి ఆరు నెలల్లో రూ.250 కోట్ల అభివృద్ధి పనులకు నిధులు కేటాయించానని తెలిపారు. త్వరలోనే అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. కొత్త రేషన్ కార్డులు మంజూరు చేస్తామన్నారు. రేషన్ షాపుల్లో సన్న బియ్యం అందజేస్తామన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ బుజ్జీ మోతీలాల్, సుబ్బారావు, గోపాల్, జితెందర్‌రెడ్డి, నాగిరెడ్డి, నీమానాయక్ పాల్గొన్నారు.

సారూ.. మా సమస్యలు పరిష్కరించాలి

కోదాడ: చాలీ, చాలని వేతనాలతో అనేక ఏళ్లుగా దుర్భర జీవితం గడుపుతున్న తమను ఆదుకోవాలని కోదాడ మున్సిపల్ కార్మికులు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కోరారు. సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయాలని పర్మినెంట్ కార్మికులతో పాట తమను కూడా పర్మినెంట్ చేసి వేతనాలు ఇవ్వాలని కోరారు. న్యాయమైన సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని మంత్రి హామీ ఇచ్చినట్లు కార్మికులు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కొమ్ము నాగేశ్వరరావు, కుడుముల గోపి, యలమర్తి వెంకటేశ్వర్లు, మాతంగి నాగమణి, కుడుముల ధనమ్మ, బ్రహ్మం, మంగమ్మ నాగరాజు పాల్గొన్నారు.

రాజగోపురం నిర్మించాలి : మంత్రి ఉత్తమ్

మేళ్లచెర్వు: ఆలయంలో నూతనంగా నిర్మించే రాజగోపురాన్ని శివనామస్మరణ చేస్తూ, నిర్మించాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలకేంద్రంలో గురువారం పర్యటించిన మంత్రి కలెక్టర్ తేజస్ నందలాల్‌పవర్‌తో కలిసి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఇష్టకామేశ్వరి సమేత స్వయంబు శంభులింగేశ్వరస్వామి వారిని దర్శించుకున్న మంత్రికి ఆలయ అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. రూ.55 లక్షల వ్యయంతో ఆలయానికి దక్షిణం వైపున ఐదు అంతస్థులతో నూతనంగా నిర్మించే రాజగోపురానికి మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అంటేనా సెక్యూలరీ పార్టీ అని ఒకేరోజు హిందూ, ముస్లిం, క్రిస్టియన్లకు చెందిన పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించామన్నారు. అనంతరం మండల కేంద్రంలో మక్కా మసీదు సమీపంలో రూ.1.50 కోట్లతో షాదీఖానాకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాస్, ఆర్‌అండ్‌బి ఈఈ భాస్కర్, దేవాలయ శాఖ సహాయ కమిషనర్ కె. మహేంద్రకుమార్, ఎంఆర్‌ఓ జ్యోతి, ఎంపీడీవో అజ్గర్ అలీ, మాజీ ఎంపీపీ కొట్టె పద్మ సైదేశ్వరరావు, జడ్పీటీసీ పద్మ గోవిందరెడ్డి, ఆలయ ఈవో కొండారెడ్డి, ఆలయ చైర్మన్ శంభిరెడ్డి, కాపుగల్లు భాస్కర్‌రెడ్డి, మునావర్ పోశం వెంకటరెడ్డి పాల్గొన్నారు.



మేళ్లచెర్వులో మంత్రి ఉత్తమ్‌కు ఆశీర్వచనం చేస్తున్న అర్చకులు

అనంతగిరి మండల అభివృద్ధికి కృషి : మంత్రి ఉత్తమ్

అనంతగిరి/కోదాడ: అనంతగిరి మండలాభివృద్ధికి కృషి చేస్తానని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. అనంతగిరి మండల కేంద్రంలో ఎంపీడీఓ, తహసీల్దార్, పోలీస్‌స్టేషన్ భవనాలకు శంకుస్థాపన చేశారు. గత ప్రభుత్వం ఆర్భాటంగా మండలాలను ఏర్పాటు చేసింది కానీ వాటి బాగోగులు పట్టించుకోలేదన్నారు. ఎక్కడా కూడా ప్రభుత్వ కార్యాలయాలకు పక్కా భవనాలు లేవన్నారు. కొత్త మండలాలు ఏర్పాటు చేసి అధికారులు, ప్రజలను ఇబ్బందులకు గురి చేశారని ఆరోపించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే కొత్త మండలాల్లోని సమస్యలు పరిష్కరించడంతో పాటు ప్రభుత్వ కార్యాలయాలకు పక్కా భవనాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. దీంతో పాటుగా మండలంలో గ్రామీణ రహదారులను అభివృద్ధి చేస్తున్నామన్నారు. పరుస్తున్నామని, సింగిల్ రోడ్లను డబుల్ రోడ్లుగా మారుస్తున్నట్లు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో అనంతగిరిని మండల కేంద్రంగా చేశారని, అప్పటి ఎమ్మెల్యే అభివృద్ధి గురించి పట్టించుకోలేదన్నారు. సమావేశంలో మాజీ ఎంపీపీ చుండూరి వెంకటేశ్వరరావు, మాజీ జెడ్పీటీసీ కొణతం ఉమా, కాంగ్రెస్ నాయకులు క్రిష్ణయ్య, శ్రీనివాస్‌రెడ్డి, డేగ కొండయ్య మాట్లాడారు. కార్యక్రమంలో కలెక్టర్ తేజస్ నందాలాల్ పవర్, ఏఎస్పీ నాగేశ్వరరావు, తహశీల్దార్ రవికుమార్, వేనేపల్లి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సర్వీస్ రోడ్డు మంజూరుకు కృషిచేస్తా

అల్వాలపురం, తమ్మర, బండపాలెం గ్రామస్థులకు కోదాడ-ఖమ్మం బైపాస్ రోడ్డు పక్క నుంచి సర్వీస్ రోడ్డు ఏర్పాటుకు కృషి చేస్తానని మంత్రి ఉత్తమ్ అల్వాలపురం గ్రామస్థులకు హామీ ఇచ్చారు. ఇప్పటికే ఈ విషయంపై సంబంధిత అధికారులకు లేఖ రాశానని తెలిపారు. అల్వాలపురం వచ్చిన మంత్రి దృష్టికి ఈ విషయం తీసుకురావడంతో సర్వీస్ రోడ్డు త్వరలో ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని వారికి హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో కౌన్సిలర్లు సామినేని నరేష్, రమేష్, కనగాల రాధాకృష్ణ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.

అడవిదేవులపల్లిలో సామాజిక తనిఖీ


సామాజిక తనిఖీలో మాట్లాడుతున్న అధికారులు

అడవిదేవులపల్లి, జూలై 4: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఎంజీఎన్ఆర్ఈజీఎస్ మూడవ విడత సామాజిక తనిఖీ (ఓపెన్ ఫోరం) నిర్వహించారు ఈ సందర్భంగా ఎంపీడీవో కరుణాకర్‌రావు మాట్లాడుతూ 1 ఏప్రిల్ 2023 నుంచి 31 మార్చి 2024 వరకు జరిగిన ఉపాధి హామీ పనులు మొత్తం రూ. 2,25,36,998కు జరిగిన పనులు నిర్వహించినట్లు తెలిపారు. అడిషనల్ పీడీ నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో వారం రోజుల నుంచి మండల పరిధిలోని 13 గ్రామపంచాయతీల్లో రికార్డులను పరిశీలించినట్లు పేర్కొన్నారు. ఎన్ఆర్ఈజీఎస్ పనులపై, నర్సరీల్లో మొక్కల పెంపకంపై ఆయన పంచాయతీ కార్యదర్శులకు, టీఏలకు, ఎఫ్ఏలకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారి వేణుగోపాల్‌రావు, ఏపీవో సూరానాయక్, ఎంపీవో మోసిన్‌బీన్‌అహ్మద్, టీఏలు, పంచాయతీ కార్యదర్శులు, ఎఫ్ఏలు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

'జీపీ కార్మికులకు జీతాలు ఇవ్వలేని ప్రభుత్వం'

చిట్యాల, జూలై 4: ప్రభుత్వం పారిశుధ్య కార్మికులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితిలో ఉందని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య విమర్శించారు. చిట్యాలలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జీతాలు లేక పారిశుధ్య కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు అధిక పనిభారంతో బాధపడుతూ దీర్ఘకాలిక సెలవులో వెళ్లే యోచనలో ఉన్నారని ఆయన అన్నారు. ఎన్నికల హామీలను అమలు చేయాలని లేనిచో ప్రజల పక్షాన ఉద్యమిస్తామని ఆయన హెచ్చరించారు. సమావేశంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు పొన్నం లక్ష్మయ్య, నాయకులు గోధుమగడ్డ జలందర్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, ఎల్లయ్య, స్వామి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

అలరిస్తున్న సురభి కళాకారుల నాటక ప్రదర్శనలు


సతీసావిత్రి నాటకాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు

నార్కట్‌పల్లి, జూలై 4: నార్కట్‌పల్లి మండల కేంద్రంలో శ్రీ శారదా విజయ నాట్య మండలి సురభి కళాకారులు ప్రదర్శిస్తున్న పౌరాణిక నాటకాలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. సినిమాను తలపించే రీతిలో సెట్టింగులు పాత్రలకు తగినట్లుగా కళాకారుల వేషధారణ, డైలాగ్‌లతో సతీ సావిత్రి నాటకంలోని సన్నివేశాలు ఆద్యంతం రసవత్తరంగా సాగాయి. సత్యవంతుని వివాహం, మరణం, యమధర్మరాజు స్వయంగా ప్రాణాలు తీసుకెళ్తుండగా అతనిని వెంబడించి సావిత్రి తన భర్త ప్రాణాలు కాపాడుకోవటానికి సత్యలోకం వరకు వెళ్లి సజీవమైన భర్తతో తిరిగి భూలోకం చేరిన సన్నివేశాలు వీక్షకులను అలరించాయి. పలువురు స్థానిక నేతలు ఈ నాటకాన్ని వీక్షించి సురభి కళాకారులను అభినందించారు.

ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే చర్యలు

మునుగోడురూరల్, జూలై 4: ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే చర్యలు తప్పవని ఎస్ఐ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. మండలంలోని కొరటికల్ గ్రామంలో గురువారం సాండ్ టాక్సీ విధానంపై ట్రాక్టర్ యజమానులకు నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. సాండ్ టాక్సీ ఇసుక బుక్ చేసుకున్న వినియోగదారులకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఇసుకను అందించాలన్నారు. సాండ్ టాక్సీ ముసుగులో అక్రమాలకు పాల్పడితే సదరు వాహనాన్ని సీజ్ చేసి యజమానిపై కేసు నమోదు చేసి జైలు పంపుతామని ఆయన హెచ్చరించారు. సమావేశంలో తహసీల్దార్ నరేందర్, ఎంపీడీవో పూజ, ఎంపీవో, ట్రాక్టర్ యజమానులు, పంచాయతీ రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పూజా సామగ్రి విక్రయానికి వేలం పూర్తి

నల్లగొండ కల్చరల్, జూలై 4: చిట్యాల మండలం వెలిమినేడు గ్రామంలోని ఆంజనేయస్వామి దేవాలయంలో కొబ్బరికాయలు, పూజా సామగ్రి, లడ్డు, పులిహోర, ప్రసాదాలు విక్రయించే హక్కులను భువనగిరి ప్రాంతానికి చెందిన బాలప్రభువుకు అప్పగించినట్లు దేవాదాయశాఖ ఏసీ మహేంద్రకుమార్, పరిశీలకురాలు వెంకటలక్ష్మి, ఆలయ అధికారి అంబటి నాగిరెడ్డి తెలిపారు. వేలంపాటలో ఐదుగురు పాల్గొనగా రూ.7.11 లక్షలకు బాల ప్రభువు దక్కించుకున్నారు. విక్రయ హక్కు ఏడాది పాటు ఉంటుందని తెలిపారు.

అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలి


చింతపల్లిలో బాధ్యతలు స్వీకరించిన సక్కుబాయి

చింతపల్లి, మునుగోడు, మర్రిగూడ, మిర్యాలగూడ రూరల్, తిరుమలగిరి(సాగర్), జూలై 4: గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించడానికి అధికారులు సిబ్బంది చిత్తశుద్ధితో పని చేయాలని మండల ప్రత్యేక అధికారులు పేర్కొన్నారు. ఎంపీటీసీల పదవీకాలం ముగిసినందున గురువారం పలు మండలాల్లో ప్రత్యేక అధికారులు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారులు, సిబ్బంది తమ విధులు, బాధ్యతలపై అలసత్వం చూపకుండా అంకితభావంతో పనిచేస్తూ సేవలందించాలని అన్నారు. ప్రతీ సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో, ప్రతీ గురువారం గ్రామ పంచాయతీల్లో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. మండలంలో అభివృద్ధి, సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజలు సహకరించాలన్నారు. అనంతరం ఆయా కార్యాలయాల సిబ్బంది వారిని ఘనంగా సన్మానించారు.

● చింతపల్లి మండల ప్రత్యేక అధికారిగా జిల్లా సంక్షేమ అధికారి సక్కుబాయి బాధ్యతలు స్వీకరించారు. ఎంపీడీవో కార్యాలయంలో ప్రత్యేక అధికారిగా బాధ్యతలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సుజాత, సాయి, ప్రవీణ్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● మునుగోడులో జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో) కె.మురళి ప్రత్యేక అధికారిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేసే సంక్షేమ, అభివృద్ధి పథకాలను పారదర్శకంగా అమలు చేస్తూ గ్రామాల్లో ప్రజల సమస్యలను పరిష్కరించడానికి సహకరించాలని కోరారు. అనంతరం మండలంలో నిర్వహించిన గ్రామ ప్రజావాణి కార్యక్రమాలతో పాటు వివిధ పథకాల పనితీరుపై సమీక్ష నిర్వహించారు. ఆయన వెంట ఎంపీడీవో పూజ, సిబ్బంది ఉన్నారు.

● మర్రిగూడ ప్రత్యేక అధికారిగా మునుగోడు ఏడీఏ ఎల్లయ్య ఎంపీడీవో కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఆయన వెంట ఎంపీడీవో మున్నయ్య ఉన్నారు. ఈ సందర్భంగా ఆయన్ను ఘనంగా సన్మానించారు.

● మిర్యాలగూడ మండల ప్రత్యేకాధికారిగా డాక్టర్ జూలకంటి వెంకట్‌రెడ్డిని నియమించారు. బాధ్యతలు స్వీకరించారు. గతంలో సైతం ఆయన మండల ప్రత్యేక అధికారిగా పనిచేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో శేషగిరిశర్మ, సీనియర్ అసిస్టెంట్ సీహెచ్.భరద్వాజ, ఏపీవో కళావతి, పంచాయతీ కార్యదర్శి క్రాంతి సిబ్బంది ఫిరోజ్ పాల్గొన్నారు.

● తిరుమలగిరి(సాగర్) మండల ప్రత్యేక అధికారిగా ఆర్.కిరణ్ కుమార్ ఎంపీడీవో కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రమేష్, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజానీకానికి తెలియజేయడం ఏమనగా, మా క్లయింట్ శ్రీమతి అనంతుల మమత, భర్త కరుణాకర్‌రెడ్డి, నివాసం : గ్రాః అంతంపేట మంః మర్రిగూడ గారు తన అనువంశిక వంశపారంపర్య ఆస్తిలో భాగము నిమిత్తము వారి తల్లిదండ్రులైన శ్రీ చల్లా సత్తిరెడ్డి, శ్రీమతి చల్లా భాగ్యమ్మ మరియు అన్న గారైన చల్లా లక్ష్మారెడ్డి అందరి గ్రామము అంతంపేట, మండలం మర్రిగూడ గారలపై విభాగాల దావా వేసి ఉన్నారు. అట్టి కేసు ఓ.యస్. నెం. 82/2021 గౌరవ జూనియర్ సివిల్ జడ్జి, దేవరకొండ గారి సన్నిధిలో నడుచుచున్నది. దావా భూమి సర్వే నెం. 42/ఎ3 & 43/ఎ3లో ఎ.4-09గుంటలు మరియు 42/ఎ4 మరియు 43/ఎ4లో ఎ.4-08 గుంటలు మొత్తం ఎ.8-17గుంటలు సోమరాజుగూడెం గ్రామం, ఘట్టుప్పల్ మండలములో గలదు. ఇట్టి భూమి కొంత వారి అన్నగారైన లక్ష్మారెడ్డి గారు మరియు వదిన శ్రీమతి చల్లా అనిత గారి పేర్లపై పట్టా కలిగి ఉన్నారు. మా క్లయింట్ యొక్క క్లయిములు, హక్కులు వగైరాలు కోర్టు ద్వారా ఇంకా పరిష్కరింపబడలేదు. తుది తీర్పులు వెలువడవలసి ఉన్నది. ఈ లోపుగానే పై చూపిన వ్యక్తులు ఇట్టి భూమిని అన్యాక్రాంతము చేయాలని అమ్మచూపుతు న్నారని మా క్లయింటు ద్వారా తెలిసినది.

కావున సమస్త ప్రజానీకానికి తెలియచేయడమేమనగా ఇట్టి దావా భూమిని ఎవరు కొనకూడదని, ఎలాంటి లావాదేవీ లు జరుపరాదని హెచ్చరించడమైనది. ఇట్టి నోటీసుకు వ్యతిరేకంగా ఎవరైనా వ్యవహరించి పైన వ్యక్తులతో లావా దేవీలు జరిపినచో మా క్లయింటు తీసుకొనబోయే సమస్త సివిల్, క్రిమినల్ చర్యలకు బాధ్యులు కాగలరని ఇందు మూలముగా హెచ్చరించడమైనది.

ఇట్లు : సం/- నెమ్మికంటి గౌరీశంకర్,
నెమ్మికంటి రమాశంకర్,
అడ్వకేట్స్, దేవరకొండ.
సెల్: 98488 96788, 94404 24404

పారిశుధ్యం పాటించాలి

మర్రిగూడ, జూలై 4: పారిశుధ్యం పాటించాలని వైద్యాధికారి డాక్టర్ దీపక్ అన్నారు. సీజనల్ వ్యాధులు సోకకుండా ముందస్తుగా మర్రిగూడ ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్ర వైద్య బృందం గురువారం గిరిజనులకు అవగాహన కల్పించారు. మండలంలోని బోధ్యాతండాలో ఇంటింటికి తిరుగుతూ నీటి నిల్వల వల్ల వచ్చే వ్యాధుల గురించి తెలియజేశారు. అనంతరం తండాలోని పలు ఇళ్లల్లో నిల్వ ఉన్న నీటిని తొలగించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో సుజాత, హెచ్ఈవో విజయ్ ప్రసాద్, సీహెచ్ఎస్ కమల, సూపర్‌వైజర్ విజయలక్ష్మి, ఏఎన్ఎంలు ఆశావర్కర్లు ఉన్నారు.

నీట్ కుంభకోణంపై విచారణ జరిపించాలి

నల్లగొండటౌన్, జూలై 4: ఎంబీబీఎస్, ఇతర వైద్యవిద్య కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన నీట్-యూజీ 2024 ఎంట్రన్స్‌లో జరిగిన పేపర్ లీకేజీ ఘటనపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. అక్రమాలకు పాల్పడిన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్.టీ.ఏ)ను శాశ్వతంగా రద్దు చేయాలని, జాతీయ స్థాయి పరీక్ష విధానాన్ని రద్దు చేసి, రాష్ట్రాల పరిధిలోనే నిర్వహించాలన్నారు. ఈ మేరకు గురువారం అఖిల భారత విద్యాసంస్థలు బంద్ పిలుపులో భాగంగా జిల్లా కేంద్రంలో ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, పీడీఎస్ యూ, ఎన్ఎస్‌యూఐ, డీవైఎఫ్ఐ, పీవైఎల్ సంఘాల ఆధ్వర్యంలో విద్యాసంస్థల బంద్ నిర్వహించారు. పట్టణంలోని కేజీ టూ పీజీ విద్యాసంస్థలు స్వచ్ఛందంగా బంద్ పాటించాయి. ఈ సందర్భంగా ఆయా సంఘాల బాధ్యులు ఇందూరు సాగర్, మల్లం మహేష్, కమ్మంపాటి శంకర్, బరిగెల వెంకటేష్, ముదిగొండ మురళీకృష్ణ, తరుణోజు సాయి తేజ మాట్లాడుతూ దేశంలో బీజేపీ ప్రభుత్వం పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేస్తుందని ఆరోపించారు. నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంలో బీజేపీ ప్రజాప్రతినిధుల హస్తం ఉందని, అందుకే విచారణ చేయడానికి వెనకాడుతుందని అన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాలో బీహార్, యూపీ, గుజరాత్‌లో రూ. 34లక్షలకు నీట్ ప్రశ్నపత్రాలు విక్రయించారని, ఈ వ్యవహారంలో అరెస్టులు జరుగుతున్నాయని వార్తలు వస్తున్నా ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం దారుణమని మండిపడ్డారు. నీట్ రాసిన విద్యార్థులకు న్యాయం చేయాలని, విద్యార్థులకు, దేశ ప్రజలకు మోదీ ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీవైఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శి బీవీ చారి, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి పోలె పవన్, ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు గాదేపాక సూర్యతేజ, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు కమ్మంపాటి సాయి, తరుణ్, నాగార్జున, శరత్, గురువేందర్, శ్రీకాంత్, కల్యాణ్, వెంకట్, నవదీప్ పాల్గొన్నారు.

● దామరచర్లలో విద్యాసంస్థల బంద్ విజయవంతమైంది. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి వీరన్ననాయక్, విష్ణు, రాహుల్, మణికంఠ, రమేష్, సాగర్, అంజి, లోకేష్, సందీప్, రాకేష్, సాగర్ పాల్గొన్నారు.

● విద్యా సంస్థల బంద్ విజయవంతం

● పెద్దవూరలో నిర్వహించిన బంద్ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు రమావత్ శోభన్‌బాబు, ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి కోరె రమేష్, నాయకులు సంతోష్, గణేష్, అఖిల్, జగదీష్‌చంద్ర, మహేష్, హేమంత్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

● వేములపల్లిలో నీట్ పేపర్ లీకేజీలపై సమగ్ర విచారణ చేపట్టి దోషులను కఠినంగా శిక్షించాలని విద్యార్థి, యువజన సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘాల నాయకులు జిల్లా యాదగిరి, పతాని శ్రీను, బొంగర్ల వినోద్, పుట్టల సంపత్, అంజి, సోమేష్, రాహుల్, శివ, మణిదీప్, మధు, సాయి, చింటు తదితరులు పాల్గొన్నారు.

● మిర్యాలగూడ టౌన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు ఎంఏ.ఆరీఫ్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కుర్ర సైదానాయక్, ఏఐవైఎఫ్ డివిజన్ కార్యదర్శి లింగానాయక్, నాయకులు రూపావత్ హరిప్రసాద్, వదూద్, జగన్, రోమన్, అనిల్, వంశీ, నాగపుష్ప, ఉపేందర్, సూర్యకిరణ్ తదితరులు పాల్గొన్నారు.

● హాలియాలో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నియోజకవర్గ కార్యదర్శి కోరే రమేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు రమావత్ శోభన్ నాయక్, ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్షుడు జగదీష్, చందు, వర్షిత్, మహేష్, హేమంత్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

● తిప్పర్తిలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యాసంస్థల బంద్ విజయవంతమైంది.

● మర్రిగూడలో ఏఐఎస్ఎఫ్ పిలుపు మేరకు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలను, కళాశాలలను బహిష్కరించి బంద్ నిర్వహించారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకుడు మహేందర్, నాయకులు పాల్గొన్నారు.

● నాగార్జునసాగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థి సంఘ నాయకులు సురేష్, మను, అభిలాష్, బాలాజీ, ఖాసీం, వంశీ పాల్గొన్నారు.

● పెద్దఅడిశర్లపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి దున్న రవి, ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు మునగాల శివ, నాయకులు భూషరాజు, రాము, నారాయణ. మహేష్, పండు, మౌనిక, అనూష, ఆంజనేయులు, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.


ఎన్‌జీ కళాశాల ఎదుట నిరసన తెలియజేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

● మునుగోడులో వివిధ సంఘా నాయకులు చాపల విప్లవ్‌కుమార్, ఉదయ్‌కుమార్. బండారి శకంర్, ఆంజనేయులు, మల్లేష్ పాల్గొన్నారు.

● కొండమల్లేపల్లిలో నిర్వహించిన సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రమావత్ లక్ష్మణ్‌నాయక్, చరణ్, సిద్ధు, ఇద్ది రాములు, శాంతి, గణేష్, ఆంజనేయులు, మంజుల, మౌనిక పాల్గొన్నారు.

● దేవరకొండలో నిర్వహించిన కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు రమావత్ లక్ష్మణ్, ఎనిమల్ల సాయినాయక్, శ్రీకాంత్, కార్తీక్, కొర్ర రహుల్, శోభన్, జ్యోతి, మాధవి, అరవింద్, అల్తాఫ్, స్వాతి పాల్గొన్నారు.

● నకిరేకల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లి అంజన్‌కుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆకారపు నరేష్, డివిజన్ కార్యదర్శి రవీందర్, పోడేటి సింహాద్రి, నోముల గణేష్, సందీప్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

● చిట్యాలలో నిర్వహించిన కార్యక్రమంలో డీవైఎఫ్ఐ మండల కార్యదర్శి వడ్డగాని మహేష్, ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి జిట్ట సురేష్, నాయకులు ప్రణీత్, బాబు, సాయికిరణ్, పవన్, అరుణ్‌కుమార్, శివశంకర్, గణేష్, దినేష్, శ్యామ్, మనోజ్, ధనుష్, కార్తీక్, శ్రీశైలం పాల్గొన్నారు.


పీఏపల్లి : విద్యార్థులతో ఎస్ఎఫ్ఐ, ఎన్ఎస్‌యూఐ నాయకులు


హాలియాలో విద్యాసంస్థలను బంద్ చేయిస్తున్న నాయకులు


దామరచర్లలో మాట్లాడుతున్న వీరన్ననాయక్


మిర్యాలగూడలో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

సమస్యల సత్వర పరిష్కారానికే 'ప్రజావాణి'


నల్లగొండలో అర్జీలను స్వీకరిస్తున్న అధికారులు

వేములపల్లి, హాలియా, నాగార్జునసాగర్, తిరుమలగిరి(సాగర్), తిప్పర్తి, చింతపల్లి, రామగిరి, నకిరేకల్, చిట్యాలరూరల్, జూలై 4: గ్రామీణ ప్రాంతాల్లో సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని ఆర్డీవో శ్రీనివాస్‌రావు తెలిపారు. గురువారం వేములపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అధికారులు ప్రజావాణి కార్యక్రమానికి సకాలంలో పాల్గొని ప్రజల నుంచి వచ్చే దరఖాస్తులను ఎప్పటికప్పుడు గుర్తించి తగిన పరిష్కారం చూపాలన్నారు. ప్రజావాణిపై ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శారదాదేవి, పంచాయతీ కార్యదర్శి శ్రవణ్, ఏఎన్ఎం శైలజ, ఎఫ్ఏ తులసీ, అంగన్‌వాడీలు రోజ, శోభ, ఆశా వర్కర్లు రాధిక, విఘ్నేశ్వరి, గ్రామస్తులు పాల్గొన్నారు.

● హాలియాలో మున్సిపాలిటీ 1వ వార్డు ఇబ్రహీంపేట గ్రామంలో అధికారులు ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమాన్ని మునిసిపల్ చైర్‌పర్సన్ సలహాదారుడు యడవల్లి నరేందర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. వార్డులో తీవ్రమైన కరెంటు కోత సమస్య ఉందని, మిషన్ భగీరథ నీరు వృథా కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని వార్డుకు చెందిన అంజాద్‌ఖాన్ ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు నల్లబోతు వెంకటయ్య, నాయకులు ఎండీ అక్బర్‌ఖాన్, రాములుగౌడ్, అధికారులు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

● నందికొండ మునిసిపాలిటీలో 12 వార్డుల్లో ప్రజా సమస్యలపై దరఖాస్తులను స్వీకరించారు. 10వ వార్డులో చైర్‌పర్సన్ తిరుమలకొండ అన్నపూర్ణ ప్రజావాణి కార్యకరమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కమిషనర్ శ్రీను, కౌన్సిలర్లు మంగ్త, రఘువీర్, నాగశిరీష, రమేష్‌జీ, నాగరాణి, ఇందిర పాల్గొన్నారు.

● తిరుమలగిరి(సాగర్) మండలంలోని పలు గ్రామపంచాయతీ కార్యాలయాల్లో ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో ప్రజావాణిని నిర్వహించినట్లు ఎంపీడీవో రమేష్ తెలిపారు. మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణిలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌కు జీపీ కార్మికులు తమకు జీతాలు ఇవ్వాలని కోరారు.

● తిప్పర్తి మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో తాగునీరు, వైద్యం, పరిశుభ్రత వంటి సమస్యలపై గ్రామస్థులు ఫిర్యాదులు అందజేశారు. తిప్పర్తిలో ఎంపీడీవో వెంకటేశ్వర్‌రెడ్డి ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నర్సింహస్వామి, ఆశాలు పాల్గొన్నారు.

● చింతపల్లిలో గ్రామపంచాయతీ కార్యాలయంలో తహసీల్దార్ విజయ్‌కుమార్ ప్రజావాణి ద్వారా అర్జీలను స్వీకరించారు. ఆయన వెంట రెవెన్యూ సిబ్బంది ప్రశాంత్ తదితరులు ఉన్నారు.

● నల్లగొండ పట్టణంలో గురువారం నిర్వహించిన ప్రజావాణిలో 48వార్డులకుగాను 146 దరఖాస్తులు వచ్చాయి. పారిశుధ్యం, విద్యుత్ లైట్లు, మంచినీటి సరఫరా వంటి సమస్యలపై ఫిర్యాదు వచ్చినట్లు అధికారులు తెలిపారు. మునిసిపల్ శాఖ చేసే వాటిపై మాత్రమే దరఖాస్తులు తీసుకున్నారు. ప్రజాపాలనలో అందిన దరఖాస్తుల సవరణ కూడా ఉంటుందని అధికారులు ప్రకటించినా ప్రజావాణిలో నిర్వహించిన సిబ్బంది మాత్రం దరఖాస్తులను స్వీకరించలేదు. దీంతో చాలామంది ప్రజలు దరఖాస్తు చేయకుండానే వెనుతిరిగి వెళ్లారు.

● నకిరేకల్ మండలంలో నిర్వహించిన ప్రజావాణిలో 80దరఖాస్తులు అందజేశారు. మండలంలోని 17 గ్రామపంచాయతీల్లో నిర్వహించిన ప్రజావాణికి 47 దరఖాస్తులు రాగా నకిరేకల్ మునిసిపాలిటీలోని 20 వార్డుల్లో 33 ఫిర్యాదులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. మంగళపల్లి గ్రామంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నల్లగొండ ఆర్డీవో రవి పర్యవేక్షించారు.

● చిట్యాల మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రజావాణిని నిర్వహించినట్లు ఎంపీడీవో ఎస్‌పీ జయలక్ష్మి అన్నారు. ఉరుమడ్లలో జీపీ కార్మి కులు తమకు వేతనాలు ఇప్పించాలని ఫిర్యాదు చేశారు. మండలవ్యాప్తంగా 123 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీవో తెలిపారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం అందజేత

తిరుమలగిరి(సాగర్), జూలై 4: మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో పదో తరగతి పరీక్షా ఫలితాల్లో 10 జీపీఏ సాధించిన రంగుండ్లతండాకు చెందిన ఆంగోతు రవినాయక్, పద్మల కుమారుడు ఆంగోతు నంద, ఎల్లాపురం తండాకు చెందిన రమావత్ స్వామినాయక్ మంగిల కుమారుడు రమావత్ సర్దార్‌లను గురువారం ఏకే ఫౌండేషన్ చైర్మన్ కట్టెబోయిన అనిల్‌కుమార్ శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఒక్కొక్కరికి రూ.5 వేల నగదు ప్రోత్సాహకం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరూ ఉన్నత స్థితిలోకి రావాలంటే చదువు ఒక్కటే మార్గమన్నారు. పేద విద్యార్థుల చదువుకు తన సహకారం ఎల్లప్పుడు ఉంటుందన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాస్, వినయ్‌కుమార్, అమృతయ్య, జార్జ్, జటావత్ భాను, భిక్షంనాయక్, దేవ్‌నాయక్, శంకర్‌నాయక్, బాలునాయక్, మన్నెం కోటి, రాము, శేఖర్, అనిల్ పాల్గొన్నారు.

'తిరుమలగిరికి షటిల్ బస్సు నడపాలి'

శాలిగౌరారం, జూలై 4: సూర్యాపేట డిపో బస్సులను నకిరేకల్ నుంచి వయా శాలిగౌరారం, గురజాల, అడ్డగూడురు మీదుగా తిరుమలగిరికి గంటకు ఒక బస్సు సౌకర్యం కల్పించాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి, కాంగ్రెస్ నాయకులు షేక్ ఇంతియాజ్ అహ్మద్ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. నకిరేకల్ నుంచి శాలిగౌరారం, అడ్డగూడూరు మీదుగా తిరుమలగిరికి బస్సులు నడిపిస్తే శాలిగౌరారం మండల ప్రజలకు జనగాం, వరంగల్, తొర్రూరు ప్రాంతాలకు వెళ్లేందుకు సౌకర్యం ఏర్పడుతుందన్నారు. ఆర్టీసీ అధికారులతో మాట్లాడి నకిరేకల్ నుంచి శాలిగౌరారం మీదుగా తిరుమలగిరికి షటిల్ బస్సులు ఏర్పాటుకు కృషి చేస్తానని మంత్రి వెంకట్‌రెడ్డి హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

ఐఎన్‌టీయూసీ మండల అధ్యక్షుడిగా అక్బర్


షేక్ అక్బర్

పెద్దఅడిశర్లపల్లి, జూన్ 4: ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా అంగడిపేట గ్రామానికి చెందిన షేక్ అక్బర్ నియమితులయ్యారు. గురువారం ఎమ్మెల్యే బాలునాయక్, ఐఎన్‌టీ యూసీ జిల్లా అధ్యక్షుడు సోమన్న అక్బర్‌కు నియమకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా షేక్ అక్బర్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన ఎమ్మెల్యే బాలునాయక్, రాష్ట్ర నాయకులు నాగన్నగౌడ్, సైదాచారి, మురళీకృష్ణకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వీరబోయిన ఎల్లయ్య, నాయకులు కుక్కల గోవర్ధన్‌రెడ్డి, నెర్మటి సతీష్‌రెడ్డి, పాండునాయక్, వెంకట్‌రెడ్డి, కుశలయ్య, దయాకర్, నెల్సన్ పాల్గొన్నారు.

కొమరయ్య స్ఫూర్తితో సమస్యలపై ఉద్యమించాలి


సీపీఎం కార్యాలయంలో కొమరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

నల్లగొండ రూరల్, నార్కట్‌పల్లి, నకిరేకల్, జూలై 4: దొడ్డి కొమరయ్య స్ఫూర్తితో ప్రజాసమస్యలు పరిష్కరించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉద్యమించాలని సీపీఎం, సీపీఐ జిల్లా కార్యదర్శులు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, నెల్లికంటి సత్యం అన్నారు. దొడ్డి కొమరయ్య వర్ధంతి సందర్భంగా గురువారం పట్టణంలోని పార్టీ జిల్లా కార్యాలయాల్లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాటి వీరతెలంగాణ స్ఫూర్తితో సమస్యలు లేని తెలంగాణ కోసం ఐక్యంగా ప్రజలు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కేంద్రప్రభుత్వం విభజన చట్టంలోని అంశాలను పరిష్కరించకుండా కాలయాపన చేస్తుందని ఆరోపించారు. కేంద్రప్రభుత్వం రాష్ట్రాల హక్కులు, విధులు, నిధులను కుదిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. జరగబోయే బడ్జెట్ సమావేశాల్లో నల్లగొండ జిల్లా సాగు, తాగునీటి ప్రాజెక్టుల పూర్తికి ప్రభుత్వం తగిన నిధులు కేటాయించాలని కోరారు. ప్రభుత్వం అన్ని రకాల పింఛన్లను పెంచి అందజేయాలని అన్నారు. ధరణిలో నెలకొన్న అనేక భూ సమస్యల పరిష్కారానికి కాలపరిమితి నిర్ణయించి పర్యవేక్షణ చేయాలన్నారు. కొమరయ్య అమరుడైన రోజును రైతురక్షణ దినంగా ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు తుమ్మల వీరారెడ్డి, బండా శ్రీశైలం, పాలడుగు నాగార్జున, సయ్యద్ హాషం, పి.నర్సిరెడ్డి, వి.నారాయణరెడ్డి, దండెంపల్లి సత్తయ్య, తుమ్మల పద్మ, వెంకటరమణారెడ్డి, అనంతుల శంకరయ్య, సీపీఐ నాయకులు దేవేందర్‌రెడ్డి, వీరస్వామి, నరసింహ, లెనిన్, యూసుఫ్ పాల్గొన్నారు.

● నార్కట్‌పల్లి మండల కేంద్రంలోని నర్రా రాఘవరెడ్డి భవన్‌లో దొడ్డి కొమురయ్య వర్ధంతిని నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి చెరుకు పెద్దులు, నాయకులు కల్లూరి యాదగిరి, చింతపల్లి బయ్యన్న, అర్థం శ్రీనివాస్, ఆమనగంటి ఐలయ్య, దండు రవి తదితరులు పాల్గొన్నారు.

● నకిరేకల్‌లోని నర్రా రాఘవరెడ్డి భవన్‌లో సీపీఎం ఆధ్వర్యంలో కొమరయ్య వర్ధంతిని నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం మండల, పట్టణ అధ్యక్షులు రాచకొండ వెంకట్‌గౌడ్, వంటెపాక కృష్ణ, సాకుంట్ల నర్సింహ, ఆదిమళ్ల శ్రీను, జమదగ్ని తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం...

శాలిగౌరారం: శాలిగౌరారం తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా కొనసాగుతున్న అబ్దుల్ సత్తార్ ఇన్‌చార్జి తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించారు. తహసీల్దార్ అన్వర్ హుస్సేన్ కొద్ది రోజులు సెలవు పెట్టినందున డీటీ అబ్దుల్ సత్తార్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.

నార్కట్‌పల్లి: సూర్యాపేట జిల్లా ఆత్మకూర్(ఎస్) మండలంలోని హాస్టల్‌లో విద్యార్థి మృతి చెందిన ఘటనపై విచారణ చేపట్టాలని కేవీపీఎస్ జిల్లా కమిటీ సభ్యుడు దండు రవి డిమాండ్ చేశారు.

మునుగోడు రూరల్: మండలంలోని రత్తిపల్లి గ్రామంలో తెలంగాణ క్రీడా ప్రాంగణానికి కేటాయించిన భూమికి వెళ్లే బాటను కొందరు ప్రైవేట్ వ్యక్తులు, గ్రామస్థులను అందులోకి వెళ్లకుండా కడ్డీలు పాతారు. క్రీడా ప్రాంగణానికి దారి ఇప్పించాలని రత్తిపల్లి మాజీసర్పంచ్ మాదగోని రాజేష్‌గౌడ్, గ్రామస్థులతో కలిసి డీటీ నరేష్‌కి వినతిపత్రం అందజేశారు.

మునుగోడు, మునుగోడు రూరల్: ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు నారబోయిన రవిముదిరాజ్ మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

కట్టంగూరు: కట్టంగూరు మండల ప్రత్యేకాధికారిగా తిప్పన విజయేందర్‌రెడ్డి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కార్యాలయ ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో జ్ఞానప్రకాష్ రావు, ఎంపీవో అబ్రహం, సూపరింటెండెంట్ చలపతి, ఏపీవో కడియం రాంమోహన్, తదితరులు పాల్గొన్నారు.

చిట్యాల: మండలంలోని వనిపాకల పాల ఉత్పత్తిదారుల సంఘానికి వెంటనే ఎన్నికలు నిర్వహించాలని పాల ఉత్పత్తిదారులు, నాయకులు డిమాండ్ చేశారు. చిట్యాల పాలకేంద్రం వద్ద వనిపాకల గ్రామానికి చెందిన పాల ఉత్పత్తిదారులు, నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పాల సంఘం ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల చేయడం లేదని, ఓటరు లిస్టును వెల్లడించడం లేదని ఆరోపించారు. అనంతరం పాలకేంద్రం మేనేజర్ చెన్నారెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఏళ్ల వెంకట్‌రెడ్డి, కట్టంగూరు మల్లేష్, కోన్‌రెడ్డి మహిపాల్‌రెడ్డి, బట్టు అయిలేష్, కొమురయ్య, కృష్ణ పాల్గొన్నారు.

మిర్యాలగూడ టౌన్: ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఈ నెల 7వ తేదీన గురుపూజా మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు నగర కార్యవాహ అంకినపల్లి సుధాకర్ తెలిపారు. పట్టణంలోని ఎంవీఆర్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించే కార్యక్రమానికి ఆర్డీవో శ్రీనివాసరావు, భారతీయ కిసాన్ సంఘ్ క్షేత్ర సంఘటన మంత్రి దోనూరి రాము హాజరవుతారని ఆయన తెలిపారు.

నాగార్జునసాగర్: సాగర్ హిల్‌కాలనీలో మహాత్మా జ్యోతిబారావు పూలే బీసీ గురుకుల డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న సీట్ల కోసం స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రవీంద్రచారి తెలిపారు. కళాశాలలో బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల్లో ఖాళీగా ఉన్న సీట్ల కోసం ఈ నెల 8వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ప్రిన్సిపల్ పేర్కొన్నారు. 10వ తేదీన సీట్ల కేటాయింపు ఉంటుందన్నారు. ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నల్లగొండ: జిల్లా కేంద్రంలోని మహిళా డిగ్రీ కళాశాలలో పరీక్షలు రాస్తున్న విద్యార్థులపై కక్ష సాధింపు వ్యవహరిస్తున్న అధ్యాపకురాలిపై చర్యలు తీసుకోవాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపాల్‌కు వినతిపత్రం అందజేశారు. తాము నాలుగో సెమిస్టర్ పరీక్షలు రాస్తున్నామని, ఈ సందర్భంగా ఓ అధ్యాపకురాలు డబ్బులు అడుగుతుందని, డబ్బులు ఇవ్వని వారిని నిర్ధాక్షిణ్యంగా పరీక్ష కేంద్రం నుంచి బయటకు పంపించి ఇబ్బందులకు గురి చేస్తుందని వారు వాపోయారు.

మిర్యాలగూడ టౌన్: రేవంత్ సర్కార్ విద్యార్థుల ఉసురు పోసుకుంటుదని బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి ఎండీ షోయబ్ అన్నారు. నిరుద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన ఛలో హైదరాబాద్ కార్యక్రమానికి వెళ్లకుండా అడ్డుకోవడం తగదన్నారు. ఎన్నికల ముందు యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మహేష్‌నాయుడు, శ్రీకాంత్, దత్తునాయక్ తదితరులు పాల్గొన్నారు.

మర్రిగూడ: బడి ఈడు పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు పంపించకుండా ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి, బీమనపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు ఉదావత్ లచ్చిరాం కోరారు. గ్రామంలో ఉపాధ్యాయ బృందంతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో గుణాత్మకమైన విద్య లభిస్తుందని అన్నారు.

మర్రిగూడ: మండలంలోని ఖుదాభక్ష్‌పల్లి గ్రామంలో గ్రామకంఠ భూములు ఆక్రమణకు గురవుతున్నందున ఆ భూములను కాపాడాలని ఖుదాభక్ష్‌పల్లి గ్రామస్థులు ప్రత్యేక అధికారి తారకరామన్‌కు ప్రజావాణి కార్యక్రమంలో వినతిపత్రం సమర్పించారు.

చండూరు: చండూరు పట్టణానికి చెందని ఇద్దరు స్కూల్ అసిస్టెంట్ తెలుగు ఉపాధ్యాయులు మద్దోజు వెంకటసుధీర్‌బాబు, డాక్టర్ ఇడికుడ సచ్చిదానంద వ్యాసమహర్షి పురస్కారానికి ఎంపికయ్యారు. పురస్కారాల వివరాలను హిందూ ఏ పాధ్యాయ సమితి జాతీయ అధ్యక్షుడు డేగల మహేష్, తెలంగాణ ప్రాంత అధ్యక్షుడు రాఘవేంద్ర చారి సంయుక్తంగా ప్రకటించారు. వీరిద్దరికీ ఈనెల 21న టీజీవి కళాక్షేత్రం కర్నూలులో వ్యాస మహర్షి జయంతిని పురస్కరించుకుని జరిగే జాతీయ స్థాయి కార్యక్రమంలో పురస్కారాలను అందజేయనున్నారు.

మునుగోడు: రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని బీజేపీ అనుబంధ సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు బీజేపీ కిసాన్ మోర్చా మండలాధ్యక్షుడు కమ్మంపాటి భూపాల్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు.